RNI No : TELTEL/2022/85167

పద్మక్రాంతి

(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక

సంపుటి : 03 సంచిక : 233 రంగారెడ్డి ఎడిటర్ : గంజి వెంకటేశ్ గురువారం , ఆగష్టు 14, 2025 పేజీలు : 8 వెల: 3 రూ

Volume: 03 Issue :233 Rangareddy Editor: Ganji Venkatesh Thursday, August 14, 2025 Pages:8 Price: 3/-

గోల్కొండ కోటను సందర్శించిన సిఎస్

పంద్రాగస్ట్ ఏర్పాట్లపై సమీక్ష

హైదరాబాద్,ఆగస్ట్13(పద్మక్రాంతి):

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు గోల్కొండ కోట్ ముస్తాబు అవుతోంది. ఓ వైపు వర్షాలు కురుస-్తున్నా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఈనెల 15న స్వాతంత్ర దినోత్సవ వేడుకలు జరిగే గోల్కొండ కోటలో నేడు జరిగిన ఫుల్ డ్రెస్ రిహార్సల్స్‌నురాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు పరిశీలించారు. అధికారులతో కలసి ఆయన బుధవారం గోల్కొండకోటను సందర్శించారు. అధికారులకు పలు సూచనలు చేశారు.



గవర్నర్ కోటా ఎమ్మెల్సీల
నియామకం రద్దు

- కోదండరాం, అలీఖాన్ నియామకం చెల్లదు
- గవర్నర్ నియామకంపై దాసోజ్ శ్రవణ్ పిటిషన్
- తదుపరి విచారణ సెప్టెంబర్ 17కు వాయిదా

న్యూఢిల్లీ,ఆగస్ట్13(పద్మక్రాంతి):

సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ నియామకాలపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. గవర్నర్ కోటాలో నియమితులైన ఎమ్మెల్సీ కోదండరాం, అలీఖాన్ నియామకం రద్దు చేస్తూ.. సుప్రీం ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, సత్యనారాయణ పిటిషన్‌లపై విచారణ చేపట్టిన న్యాయస్థానం కోదండరాం, అలీఖాన్ నియామకం రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. రెండు ఎమ్మెల్సీ స్థానాలలో తాజా నామినేషన్లు తమ తుది తీర్పుకి లోబడే ఉంటాయని సుప్రీంకోర్టు చెప్పుకొచ్చింది. కోదండరాం, అలీఖాన్‌లు తెలంగాణ గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా నియామకం అయిన విషయం తెలిసిందే. అయితే వీరి నియామకం అక్రమంగా జరిగిందని.. దాసోజు శ్రవణ్, సత్యనారాయణలు గవర్నర్‌కు తెలిపారు. గవర్నర్ వీరి వాదనను తిరస్కరించడంతో.. సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వారి నియామకాలపై విచారణ జరిపి నియామకాన్ని రద్దు చేయాలని బీఆర్ఎస్

3 లో

సావర్కర్, గాడ్సే భావజాలం వారితో ప్రమాదం

- తనకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

– రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ,ఆగస్ట్13(పద్మక్రాంతి):

వీరసావర్కర్ ను ఉద్దేశిస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై పరువునష్టం కేసు నమోదైన విషయం తెలిసిందే. అయితే.. సావర్కర్, గాడ్సే భావజాలాన్ని అనుసరిస్తున్న వారి నుంచి తనకు ముప్పు పొంచి ఉ ఒడొచ్చని రాహుల్ పుణె కోర్టుకు తెలిపారు. ఈ నేపథ్యంలో తనకు అవసరమైన భద్రత అందించడం కేంద్రం బాధ్యత అని పేర్కొన్నారు. 2023లో లండన్ పర్యటన సమ-యంలో సావర్కర్‌ను ఉద్దేశిస్తూ రాహుల్ గాంధీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో సావర్కర్ మునిమనవడు సాత్యకి సావర్కర్ ఆయనపై పరువునష్టం దావా దాఖలు చేశారు. ఈ కేసుకు సంబంధించి ప్రాథమిక ఆధారాలు ఉన్నట్లు–

3 లో

తెలంగాణ అంతటా రెండ్రోజుల పాటు
రెడ్ అలర్ట్

- రాష్ట్రంలో ఐదు రోజుల పాటు ఈదురు గాలులు
- వాతావరణ కేంద్రం డైరెక్టర్ నాగరత్న

హైదరాబాద్,ఆగస్ట్13(పద్మక్రాంతి):

తెలంగాణ అంతటికీ రెండ్రోజుల పాటు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు– వాతావరణ కేంద్రం డైరెక్టర్ నాగరత్న తెలిపారు. రాష్ట్రంలో ఐదు రోజుల పాటు– గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయి. ఉత్తర తెలంగాణలో 17న వర్ష తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉంది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు– భారీ వర్షాలు కురుస్తాయని నాగరత్న తెలిపారు. సంగారెడ్డి, వికారాబాద్, మెదక్, మేడ్చల్–మల్కాజ్‌గిరి, యాదాద్రి భువనగిరి, ఖమ్మం, భద్రాద్రి, భూపాలపల్లి, ములుగు జిల్లాలకు రెడ్ కలర్ వార్నింగ్ జారీ చేసినట్లు– తెలిపారు. హైదరాబాద్, హనుమకొండ, ఆదిలాబాద్, జనగామ, కామారెడ్డి, కుమురం భీం, ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, నల్గొండ, రంగారెడ్డి, సిద్దిపేట, వరంగల్ జిల్లాలకు ఆరెంజ్ కలర్ వార్నింగ్ జారీ చేసినట్లు– చెప్పారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాష్ట్రమంతటా రేపు కూడా వర్షాలు కొనసాగే అవకాశం ఉందని నాగరత్న వివరించారు. నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశాం. రేపు మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో అత్యంత భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వర్ష తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఇవాళ జీహెచ్ఎంసీ పరిధిలో రెడ్ అలర్ట్.. రేపు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశామని అన్నారు.

పౌరసత్వం రాకుండానే సోనియాకు ఓటు

- ఓటర్ జాబితాలో పేరుపై కాంగ్రెస్ సమాధానమివ్వాలి
- భాజపా నేత అమిత్ మాలవీయ

3 లో

బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణపై విచారణ

- ఎక్కువ ధృవీకరణ పత్రాలకు అనుమతి మంచిదే
- విచారణ సందర్భంగా సుప్రీం వ్యాఖ్య

3 లో

ఐసిఐసిఐ బ్యాంక్ యూటర్న్

- కనీస నిల్వలపై నిర్ణయం వాపస్

3 లో

మీరు దాడి చేస్తే.. బ్రహ్మోస్‌తో జవాబుచెబుతాం

- పాక్ ప్రధాని వ్యాఖ్యలపై మండిపడ్డ ఓవైసీ

హైదరాబాద్,ఆగస్ట్13(పద్మక్రాంతి):

తాము సింధూ జలాల కోసం ఎంత వరకైనా పోరాడతామన్న పాక్ ప్రధాని వ్యాఖ్యలపై మైదరాబాద్ ఎంపిఓవైసీ ఘాటుగా స్పందించారు. ఈ హెచ్చరికలపై తాజాగా హైదరాబాద్ ఎంపీ, ఏఐఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ స్పందించారు. అర్థంలేని మాటలు మాట్లాడొదంటూ ఫైర్ అయ్యారు. మీరు కయ్యానికి కాలు దువ్వితే మేము ఏం ఖాళీగా కూర్చోము అని సమాధానం ఇచ్చారు. మా వద్ద బ్రహ్మోస్ ఉన్నాయి. పాక్ ప్రధాని ఇలాంటి చెత్తమాటలు మాట్లాడటం మానుకోవాలంటూ హెచ్చరించారు.

3 లో

ఎమ్మెల్సీలపై సుప్రీం తీర్పు
చెంపపెట్టు

- కాంగ్రెస్, బిజెపిలకు ఇదో గుణపాఠం కావాలి: కెటిఆర్

హైదరాబాద్,ఆగస్ట్13(పద్మక్రాంతి):

ఎమ్మెల్సీలు కోదండరాం, అలీఖాన్‌ల నియామకం రద్దు చేస్తూ.. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వాగతించారు. అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన సంచలన తీర్పు అటు– బీజేపీకి, ఇటు కాంగ్రెస్‌కు చెంపపెట్టు అని విమర్శించారు. గతంలో బీజేపీ గవర్నర్ వ్యవస్థను దుర్వినియోగం చేసి బీఆర్ఎస్ పంపిన ఇద్దరు ఎమ్మెల్సీ ప్రతిపాదనలకు అడ్డుపడ్డారని గుర్తు చేశారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఆ ప్రక్రియ పెండింగ్‌లో ఉండగానే మరో ఇద్దరి పేర్లను సిఫార్సు చేసి ప్రజాస్వామ్యాన్ని అపహ-స్యం చేసిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ గతంలో నామినేట్ చేసిన బడుగు, బలహీనవర్గాలకు చెందిన దాసోజు

3 లో

నెక్లెస్ రోడ్డులో నేడు హర్ ఘర్ తిరంగా యాత్ర

హైదరాబాద్,ఆగస్ట్13(పద్మక్రాంతి):

దేశ ప్రజల్లో జాతీయ భావాన్ని మరింత పెంచేందుకు బిజెపి చేపట్టిన 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా గురువారం నెక్లెస్ రోడ్డు నుంచి అంబేద్కర్ విగ్రహం వరకూ భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు– ఆ పార్టీ ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్ రెడ్డి తెలిపారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని మూడు రోజులుగా దేశ వ్యాప్తంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు జరుగుతున్నాయని మనోహర్ రెడ్డి బుధవారం విలేఖరుల సమావేశంలో చెప్పారు. ఇదిలాఉండగా గురువారం ఉదయం 10.30 గంటలకు నెక్లెస్ రోడ్డు నుంచి ప్రారంభమయ్యే తిరంగా ర్యాలీలో పార్టీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఇతర ముఖ్య నాయకులూ పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ ర్యాలీలో విద్యార్థులూ పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 4–0 లక్షల ఇండ్లపై త్రివర్ణ పతాకాలు ఎగుర వేసేందుకు ఏర్పాట్లు– చేశామని ఆయన చెప్పారు. కుల, మతాలకు, రాజకీయాలకు అతీతంగా నాయకులు, కార్యకర్తలు, ప్రజలూ ఇందులో పాల్గొనాలని ఆయన కోరారు. ఇప్పటికే రెండు రోజులుగా తిరంగా ర్యాలీలు జరుగుతున్నాయని ఇందులో తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొంటు-న్నారని ఆయన తెలిపారు. ప్రజలంతా ఐక్యంగా నిలబడి దేశ భక్తిని చాటాలని మనోహర్ రెడ్డి కోరారు.

భారీ వర్షాల నేపథ్యంలో బయటకు రావద్దు

నగర ప్రజలకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరిక

హైదరాబాద్,ఆగస్ట్13(పద్మక్రాంతి):

భారీ వర్షాలు కురుస్తాయంటూ వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో అవసరమైతే తప్ప.. బయటకు రావద్దని హైదరాబాద్ నగర ప్రజలకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు. బుధవారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకు భారీ వర్షాలు కురవనున్నాయంటూ వాతావరణ శాఖ తెలిపిందని.. దీంతో అప్రమత్తంగా ఉండాలని

3 లో

యూరియా కోసం
రోడ్డెక్కిన అన్నదాతలు

- కాంగ్రెస్ ప్రభుత్వంలో మళ్లీ పాత పద్దతి అమలు
- యూరియాను బీహార్‌కు తరలిస్తున్నారు
- ఇద్దరు కేంద్రమంత్రులు ఉన్నా యూరియా రాదు
- యూరియా కోసం క్యూలో ఉన్న రైతులతో హరీష్ రావు

సిద్దిపేట,ఆగస్ట్13(పద్మక్రాంతి):

యూరియా కోసం అన్నదాతలు నడిరోడ్డెక్కి ధర్నాలు చేసే దుస్థితిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించాయని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రైతులకు యూరియా ఇవ్వలేని చేతగాని, దద్దమ్మ ప్రభుత్వాలు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నదాతలను అరిగోస పెడుతున్న కాంగ్రెస్,

3 లో

తెలంగాణ పట్ల కేంద్రం వివక్ష

- అధునాతన ప్యాకేజీ కంపెనీకి దక్కని అనుమతి
- కేంద్రం తీరుపై మంత్రి శ్రీధర్ బాబు అసహనం

హైదరాబాద్,ఆగస్ట్13(పద్మక్రాంతి):

తెలంగాణకు వచ్చే కంపెనీలకు అనుమతి ఇచ్చే విషయంలో కేంద్రం వివక్ష చూపుతోందని మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు. బుధవారం మంత్రి మాట్లాడుతూ.. ఏపీకి కొత్త ప్రాజెక్టులు కేటాయించి, తెలంగాణను మాత్రం పక్కన పెడుతోందన్నారు. ప్రపంచస్థాయి అధునాతన ప్యాకేజింగ్ కంపెనీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని, ఇందుకోసం మహేశ్వరంలో 10 ఎకరాల విలువైన భూమిని కేటాయించడంతో పాటు–, రాయితీలు ఇచ్చేందుకు ఆమోదిస్తూ అన్ని అనుమతులను రికార్డు స్థాయిలో పూర్తి చేశామన్నారు. అయినా కానీ, కేంద్ర క్యాబినెట్ పరిశ్రమ ఏర్పాటుకు అనుమతి ఇవ్వడం లేదన్నారు. ఏపీలో మాత్రం ఇలాంటి ప్రాజెక్టుకే కేంద్రం ఆమోదం

3 లో

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక

సంపాదకీయం

పార్లమెంట్ సమావేశాలు ఎందుకు?

బీహార్‌లో ఓట్ల సవరణలో జరిగిన అవతవకలు వేరు...పార్లమెంట్‌లో చర్చించాల్సిన అంశాలు వేరు. ఈ రెంటినీ ఒకే గాటన కట్టిన విపక్షాలు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను వృధా చేశాయి. సమస్యలపై చర్చించే అవకాశం ఉన్నా...ప్రభుత్వాన్ని నిలదీసే ప్రయత్నం చేయలేదు. కేవలం ఆందోళనతో తాము అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నారు. పార్లమెంట్‌ను స్తంభింపచేయడమే అతిపెద్ద గోల్ అన్నట్లుగా విపక్షాల తీరు కొనసాగింది. దీంతో జూలై 21న ప్రారంభమైన పార్లమెంట్ సమావేశాల్లో ఒక్కటే చర్చ జరిగింది. ఆపరేషన్ సిందూర్ తప్ప మరో అంశం చర్చకు రాలేదు. దీనికి విపక్షాలదే బాధ్యత. వీలైనన్ని ఎక్కువ సమస్యలు, ముఖ్యంగా ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను లేవనెత్తి చర్చించివుంటే బాగుండేది. ప్రతిపక్షాలు లేవనెత్తిన అంశాలపై చర్చ జరిపించడం కోసం అధికారంలో ఉన్నవారు ఎప్పుడూ ముందుకు రారు. అయితే వాయిదా తీర్మానాల రూపంలో వాటిని ప్రస్తావిస్తే కుదరదు. పార్లమెంట్ నిబంధనల మేరకు చర్చను కోరివుంటే బీహార్ ఓట్ల సవరణ అంశం కూడా చర్చకు వచ్చేది. కానీ విపక్షాలకు అలా చేయడం ఇష్టం లేదు. గందరగళం సృష్టిస్తేనే మంచిది. పార్లమెంటు సమావేశాలు ఒకప్పుడు అర్థవంతమైన చర్చలు, వాదోపవాదాలతో ఎంతో ఆసక్తి కలిగించేవి. ప్రధాన సమస్యలపై చర్చకు ప్రభుత్వాలు కూడా అనుమతించేవి. అయితే ఆనాటి నాకులు వేరు. వారు ఎంతో హుందాతనం కలిగిన వారు. కానీ ఇప్పుడు విపక్షాలకు సమస్యలపై చర్చ చేయడం కన్నా ప్రభుత్వం విమర్శలుచేశామా, పార్లమెంట్ నడవకుండా చేశామా లేదా అన్నదే ముఖ్యంగా కనిపిస్తోంది. అందుకే ఈ వర్షాకాల సమావేశాల్లో ఆపరేషన్ సిందూర్‌పై తప్ప ఏ అంశంపైనా చర్చ జరగకుండా పోయింది. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత పార్లమెంటులో ప్రభుత్వం ఏదైనా జవాబు చెబుతుందా అని ప్రతిపక్షాలతో పాటు ప్రజలు కూడా ఆశించారు. కానీ రెండు రోజుల సుదీర్ఘ చర్చ, ప్రధానమంత్రి నరేంద్రమోదీ సుదీర్ఘ ప్రసంగం తర్వాత కూడా అనేక ప్రశ్నలకు జవాబులు లభించకుండా మిగిలిపోయాయి. ముఖ్యంగా పహల్గామ్ సంఘటనకు దారి తీసిన భద్రతా వైఫల్యం నుంచి ఆపరేషన్ సిందూర్ కేవలం 88 గంటల్లోనే ముగించిన తీరుపై ప్రజల్లో అనుమానాలు ఉన్నాయి. పాక్‌కు బుద్ధి చెప్పే అవకాశం వచ్చినా కాల్పుల విరమణకు అంగీకరించడం జరిగింది. ఇకపోతే ఈ ఆపరేషన్ తరవాత పాక్ పట్ల అమెరికా స్నేహంగా వ్యవహరించడం చూస్తున్నాం. సంఘటనకు కారకులైన ఉగ్రవాదుల ఆచూకీ, విదేశాంగ విధానం గురించి ప్రజల్లోను, ప్రతిపక్షాల్లోనూ ఉన్న ప్రశ్నలకు సమాధానాలు రాలేదు. ఇకపోతే బిహార్‌లో ఎస్ఐఆర్ పేరిట జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ గురించి ప్రతిపక్షాలు తీవ్ర గందరగోళం సృష్టిస్తున్న ప్పటికీ దానిపై మాట్లాడేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదు. ఎస్ఐఆర్‌పై గందరగోళం జరుగుతున్న సమయం లోనే ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ దేశంలో ఓట్ల చోరీ జరుగుతోందని ఆరోపించారు. గత పార్లమెంటు ఎన్నికల్లో కర్ణాటకలో ఒక అసెంబ్లీ నియోజకవర్గంలోనే లక్షకు పైగా బోగస్ ఓట్ల పోలింగ్ జరిగిందని ఆయన సాక్ష్యాధారాలతో బయటపెట్టారు. దేశంలో ఎన్నికల కమిషన్ బీజేపీని గెలిపించేందుకు చేసే ప్రయత్నాల్లో భాగంగానే ఈ ఓట్ల చోరీ జరుగుతోందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ పైనే కాదు, ఓట్ల చోరీపై కూడా ఉభయ సభల్లో ప్రతిపక్షాలు వాయిదా తీర్మానాలు ప్రవేశపెట్టి చర్చను డిమాండ్ చేశారు. అయితే ఈ అంశాలపైచర్చకు పార్లమెంట్ రూల్స్ ప్రకారం అవకాశం ఉంది. కానీ విపక్షాలు దానిని ఉపయోగించు కోలేదు. పార్లమెంటులో చర్చించి ఎన్నికల సంస్కరణలపై ప్రతిపక్షాలతో కలిసి ఏకాభిప్రాయం తెచ్చేందుకు ప్రయత్నిస్తే బాగుండేది. ఒక్క బీహార్ గురించి కాకుండా మొత్తం ఎన్నికల సంస్కరణలపై చర్చించి ఉంటే విపక్షాలకు గౌరవం దక్కేది. దేశానికి ప్రయోజనం కలిగేది. దొంగ ఓట్లు లేకుండా పర్మినెంట్ ఓటర్ల ముసాయిదా ఉండేలా చేయించుకునే అవకాశం ఉండేది. అయితే విపక్షాల లక్ష్యం వేరు కనక వారు ఆ దిశగా ఆలోచన చేయలేదు. పార్లమెంటును సాగనివ్వకపోవడం వల్ల ప్రతిపక్షాలకు ప్రయోజనం లభించక పోవచ్చు. ప్రతిపక్షాలు లేవనెత్తుతున్న ప్రశ్నలకు జవాబు ఎప్పలేకపోతే,పార్లమెంటును వాయిదా వేసివుంటే విపక్షాల వాదనకు ప్రజల్లో ఆమోదం లభిస్తుంది. ప్రభుత్వం ప్రజలకు జవాబుచెప్పుకోలేని పరిస్థితిలో పడుతుంది. ప్రతిరోజూ పార్లమెంటు ఆవరణలో ప్రతిపక్షాలు నిర్వహిస్తున్న నిరసన ప్రదర్శనలు, ఎన్నికల కమిషన్‌కు ఊరేగింపుగా వెళ్ళి అనేకమంది అరెస్టు కావడం వంటి సంఘటనలు కావాలని కోరుకున్నవే. విపక్షాలు గందరగోళానికి ప్రాధాన్యం ఇచ్చారే తప్ప సమస్య పరిష్కారం కోసం కాదన్నది ముమ్మాటికీ నిజం. మొత్తంగా పార్లమెంట్ సమావేశాలను విపక్షాలు కావాలనే దుర్వినియోగ పరిచారు. కేవలం రాజకీయ ప్రయోజనాలు ఆశించి చేసిన వ్యవహారం తప్ప మరోటి కాదు. ఇదే సమయాన్ని ప్రజల కోసం ఉపయోగిం చుకుని, ఆయా అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీసి ఉంటే బాగుండేది. విపక్షాల తీరు కారణంగా జీఎస్టీ, ధరలు,నిరుద్యోగం, అమెరికాతో సంబంధాలు వంటి అనేకానేక అంశాలు చర్చకునోచుకోకుండా పోయాయి. గత ఐదారేళ్లుగా ఇలాగే జరుగుతోంది. ఇది వాంఛనీయంకాదు. పార్లమెంట్ అన్నది ప్రజల సమస్యలను చర్చించడానికి అన్న విషయం మరచిపోతున్నారు. అధికార, విపక్షాలకు ఇదో తంతుగా మారింది. ప్రజలు ఏమయితే మనకేంటన్న ధోరణిలో ఉన్నారు. ఓట్లు వేశారా, అధికారంలో ఉన్నామా లేదా అన్న తీరుమారాలి.

ప్రధాన సమస్యల విషయంలో ఇకముందు అయినా పద్ధతి మారాలి.

కుక్కల తరలింపు తీర్పు పరిశలిస్తా

- అభ్యంతరాల నేపథ్యం లో సుప్రీం చీఫ్ జస్టిస్ వెల్లడి

న్యూఢిల్లీ,ఆగస్ట్13(పద్మక్రాంతి):

కుక్కల తరలింపు అంశపై సుప్రీం చీఫ్ జస్టిస్ సానుకూలంగా స్పందించారు. దీనిని సమీక్షిస్తానని వెల్లడించారు. ఢిల్లీ, ఎన్‌సీఆర్ ప్రాంతం నుంచి వీధి కుక్కలన్నింటినీ తొలగించాలంటూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. సుప్రీం తీర్పుపై జంతు హక్కుల సంస్థలు ఆక్షేపణ తెలిపాయి. ఈ నేపథ్యంలో తీర్పు ఉత్తర్వులను తాను పరిశీలిస్తానని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు. వీధి కుక్కల దాడుల వల్ల ఢిల్లీ, ఎన్సీఆర్‌ల పరిధిలో రేబిస్ మరణాల సంఖ్య పెరుగుతోందని వస్తున్న వార్తలను పరిగణనలోకి తీసుకున్న జస్టిస్ పార్దీవాలా, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం.. 8 వారాల్లోపు అన్ని వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. ఢిల్లీ (ఉ।రె)లో ఎక్కడా వీధి కుక్కలు ఉండటానికి వీల్లేదని స్పష్టంచేసింది. ఈ చర్యలను అడ్డుకోవడానికి ఏవైనా సంస్థలు ప్రయత్నిస్తే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది. దీనిపై కేంద్ర ప్రభుత్వ వాదనలు మాత్రమే వింటామని.. తమ ఆదేశాలకు వ్యతిరేకంగా జంతు ప్రేమికులు, ఇతర పార్టీలు, సంస్థలు వేసిన పిటిషన్లను విచారించబోమని స్పష్టం చేసింది. కేంద్ర మాజీమంత్రి, జంతు హక్కుల కార్యకర్త మేనకా గాంధీ అభ్యంతరం తెలిపారు. తీర్పు ఆచరణ సాధ్యం కాదన్నారు. ఢిల్లీలో 3 లక్షల వీధికుక్కలు ఉన్నాయి. వీటికోసం 3 వేల షెల్టర్లు కావాలి. వీటి ఏర్పాటుకు రూ.15 వేల కోట్లు ఖర్చు చేసే పరిస్థితిలో ఢిల్లీ ప్రభుత్వం ఉందా? అని ప్రశ్నించారు. ఈ తీర్పు దశాబ్దాలుగా మనం అనుసరిస్తూ వచ్చిన మానవీయ, సైన్స్ ఆధారిత విధానాల నుంచి వెనకడుగు వేసినట్లుగా ఉందని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. వీధి కుక్కలన్నింటినీ గంపగుత్తగా తొలగించాలన్న

నిర్ణయం క్రూరమైనదని అన్నారు. కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకాగాంధీ, ప్రముఖ సినీనటులు జాన్ అబ్రహాం, జాన్వీ కపూర్, వరుణ్ ధావన్, సిద్ధార్థ్ ఆనంద్, అడివి శేష్ తదితరులు వీధి కుక్కల సంరక్షణపై స్పందించారు. దీంతో చీఫ్ జస్టిస్ గవాయ్ పెద్ద మనసుతో ముందుకు వచ్చారు. తీర్పును సమీక్షిస్తానని ప్రకటించారు.

సింధు జలాల ఒప్పందం ఆపితే తీవ్ర చర్యలు

- మర్చిపోలేని విధంగా గుణపాఠం చెబుతాం
- మరోమారు పాక్ ప్రధాని ప్రేలాపనలు

ఇస్లామాబాద్,ఆగస్ట్13(పద్మక్రాంతి):

సింధు జలాల ఒప్పందం నిలిపివేతతో అల్లాడిపోతున్న పాక్ నేతలు ఏం చేయాలో పాలుపోక నోటికి పని చెబుతున్నారు. యుద్ధోన్మాదంతో ఊగిపోతూ పిచ్చి ప్రేలాపనలకు దిగుతున్నారు. తాజాగా పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ భారత్‌పై నోరు పారేసుకున్నారు. భారత్‌కు ఎన్నడూ మర్చిపోలేని గుణపాఠం చెబుతామంటూ హెచ్చరించారు. నీటిని అడ్డుకుంటామంటూ బెదిరింపులకు దిగుతున్న ఈ శత్రువుకు నేను ఒకటే చెబుతున్నా.. మా నీటిలో మీరు ఒక్క చుక్కను కూడా తీసుకోలేరు. నీటిని

అడ్డుకుంటున్నామంటూ మీరు బెదిరింపులకు దిగుతున్నారు. కానీ ఇలాంటి పని చేస్తే పాక్ మీకు ఎన్నటికీ మర్చిపోలేని విధంగా గుణపాఠం చెబుతుందని వార్నింగ్ ఇచ్చారు. అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇస్లామాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని ఈ కామెంట్స్ చేశారు. సింధు నదీ జలాల పంపిణీ ఒప్పందం పాక్‌కు జీవనాడి అని పాక్ ప్రధాని అన్నారు. ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఇటీవల పాక్ విదేశాంగ శాఖ.. ఒప్పందం అమలును కోరుతూ భారత్‌కు లేఖ రాసింది. 'సింధు నదీ జలాల ఒప్పందాన్ని ఎప్పటిలాగే అమలు చేయాలని భారత్‌ను కోరుతున్నాము. ఒప్పందానికి కట్టుబడి బాధ్యతలు నిర్వర్తించాలని కోరుతున్నామని పాక్ విదేశాంగ శాఖ ఎక్స్ వేదికగా కూడా పోస్టు పెట్టింది. ఈ నేపథ్యంలో పాక్ ప్రధాని మళ్లీ రెచ్చిపోయారు. ఇటీవల పాక్ ఆర్మీ చీఫ్ మునీర్, మరో నేత బిలావల్ భుట్టో కూడా భారత్‌పై యుద్ధోన్మాదంతో రెచ్చిపోతూ నోటికొచ్చినట్టు మాట్లాడారు. భారత్‌ను ఉద్దేశిస్తూ మునీర్ అణుయుద్ధ హెచ్చరికలు చేశారు. పాక్ ఉనికికి ముప్పు వస్తే తమతో పాటు సగం ప్రపంచం అంతమవు తుందని వార్నింగ్ ఇచ్చారు. ఇక భారత్‌కు వ్యతిరేకంగా పాక్ ప్రజలు ఏకం కావాలని బిలావల్ భుట్టో పిలుపు నిచ్చారు.

భారీ వర్షాలతో అప్రమత్తమైన ప్రభుత్వం

- అధికారులతో సమీక్షించిన హోంమంత్రి అనిత
- జిల్లాల్లో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయాలని ఆదేశం

అమరావతి,ఆగస్ట్13(పద్మక్రాంతి):

ఒక వైపు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు. మరోవైపు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. బుధవారం సచివాలయంలో ఉన్నతాధికారులతో రాష్ట్ర హోమ్, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. అల్పపీడన ప్రభావంతో గురువారం కోస్తా జిల్లాల్లో పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాల్లో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలంటూ అధికారులకు సూచించారు. వర్ష ప్రభావ ప్రాంతాల్లోని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఒక వేళ.. ఎటువంటి పరిస్థితులు ఎదురైనా వాటిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని అధికార యంత్రాంగానికి ఆమె కీలక సూచనలు చేశారు.

ఇక సహాయక చర్యల కోసం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్



బృందాలు సిద్ధంగా ఉండాలన్నారు. అయితే ప్రమాదకరంగా ఉన్న హోర్డింగ్స్, నెలకూలిన వృక్షాలను వెంటనే తొలగించాలని వారికి సూచించారు. విజయవాడలో ప్రకాశం బ్యారేజి వద్ద ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో 3,19,133 క్యూసెక్కులుగా ఉందని వివరించారు. వరద ప్రవాహం కారణంగా.. మొదటి ప్రమాద హెచ్చరిక వరకు నీరు చేరే అవకాశం ఉందన్నారు. నదీ పరివాహక ప్రాంత ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇక ప్రమాద ప్రాంతాల్లో తప్పని సరిగా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలను ఎప్పటికప్పుడూ అప్రమత్తం చేయాలని సూచించారు. హోర్డింగ్స్, శిధిలావస్థలో ఉన్న భవనాలు, గోడలు, చెట్ల వద్ద ఉండరాదని ఈ సందర్భంగా ప్రజలకు మంత్రి అనిత సూచించారు. మరోవైపు భారీ వర్షాలు, అల్ప పీడనం ఏర్పడిన వేళ.. సోషల్ మీడియాలోని వదంతులను నమ్మవద్దంటూ ప్రజలకు ఆమె కీలక సూచన చేశారు. చాలా అప్రమత్తంగా ఉండాలని వారికి సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక కార్యదర్శి జి. జయలక్ష్మీ, డైరెక్టర్ ప్రఖర్ జైన్, కోస్తా జిల్లాల కలెక్టర్లతోపాటు- వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

శ్రీవారికి బంగారు లక్ష్మీ కానుక

- బెంగళూరు భక్తుడి విరాళం

తిరుమల,ఆగస్ట్13(పద్మక్రాంతి):

బెంగళూరుకు చెందిన కేఎం శ్రీనివాసమూర్తి అనే భక్తుడు బుధవారం ఉదయం తిరుమల శ్రీవారిని అలంకరించేందుకు రూ.25 లక్షల విలువైన వజ్రం, వైజయంతి పొదిగిన 148 గ్రాముల బంగారు లక్ష్మీ పతకాన్ని విరాళంగా అందించారు. ఈమేరకు శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో తితిదే అదనపు ఈవో వెంకయ్య చౌదరికి ఆభరణాన్ని అందజేశారు. బెంగళూరుకు చెందిన కల్యాణ్ రామన్ కృష్ణమూర్తి అనే భక్తుడు బుధవారం తితిదే శ్రీవేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు రూ.కోటి విరాళంగా అందజేశారు. ఈమేరకు తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరికి విరాళంగా డీడీని అందజేశారు.

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక

యూరియా కోసం రోడ్డెక్కిన అన్నదాతలు

మొదటి పేజీ తరువాయి

బీజేపీలకు రైతుల ఉసురు తగులుతుందని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ గ్రామం వద్ద ఎరువుల కోసం క్యూలో బారులు తిరిన రైతులను చూసి మాజీ మంత్రి హరీష్ రావు ఆగారు. ఈ సందర్భంగా వారిని పలుకరించగా.. ఉదయం 5 గంటల నుండి ఇక్కడే ఉంటున్నాం.. ఒక ఆధార్ కార్డుకి ఒకటే బస్తా ఇస్తామంటున్నారు. ఆధార్ కార్డు, ఓటీపీ అంటూ కాలయాపన చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని హరీశ్‌రావుతో రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. కేసీఆర్ ఉన్నప్పుడు ఈ గోస లేదని.. కాంగ్రెస్ వచ్చాక నీళ్ళు లేవు, యూరియా లేదు అంటూ రైతులు ఆవేదన వెలిబుచ్చారు. యూరియా ఎప్పుడు వేసుకోవాలి.. ఎప్పుడు పంట పండాలి అంటూ ఆందోళన వ్యక్తం చేశారు.కేసీఆర్ హయంలో హమాలీ ఖర్చులు ఇచ్చి ఇంటికి యూరియా పంపించామని హరీశ్‌రావు గుర్తు చేశారు. ఉదయం నుండి రైతులు వచ్చి ఇబ్బందులు పడుతుంటే పట్టించుకొనే అధికారి లేడు అని అగ్రికల్చర్ అధికారులపై హరీశ్‌రావు సీరియస్ అయ్యారు. 8 మంది బీజేపీ ఎంపీలు గెలిచి రాష్ట్రానికి ఎరువుల కొరత తీర్చడంలో విఫలం అయ్యారని హరీశ్‌రావు మండిపడ్డారు. ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి ఎరువుల కొరతపై నోరు మెదపడం లేదు.. రైతుల ఉసరు ఉట్టిగా పోదు.. 4 రోజుల నుండి వ్యసాయ పనులు వృధా చేసుకొని యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, బిజేపీలకు తగిన గుణపాఠం చెపుతారని హరీశ్‌రావు పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి 51 సార్లు ఢిల్లీకి పోయాడు.. కానీ ఎరువుల కొరత తీర్చలేదు. మీ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి అన్నాడు. రేవంత్ రెడ్డి తిట్లు- ఎక్కువ పని తక్కువ అని. ప్రజలకు కావాల్సింది తిట్లు కాదు, పని కావాలి. రేవంత్ రెడ్డికి తిట్ల మీద ఉన్న ధ్యాస.. పని మీద లేదు. రైతులు సూటిగా అడుగుతున్నారు కేసీఆర్ ఉన్నపుడు ఎరువులు ఎట్లా వచ్చాయి.. ఇప్పుడు ఎట్లా రావు అని. వెంటనే ఓటీ-పీ, ఒక్క బస్తా విధానాన్ని తొలగించాలని డిమాండ్ చేస్తున్నట్లు- హరీశ్‌రావు పేర్కొన్నారు.

పదేళ్ల కేసీఆర్ పాలనలో ఎరువుల ఇబ్బంది లేదు. ప్రతి మండలానికి గోదాంలు ఏర్పాటు- చేసుకొని, వేసవి కాలంలోనే ఎరువులు స్టాక్ పెట్టినం. గ్రామం నుండి రైతు కాలు బయట పెట్టకుండా.. హమాలీ, ట్రాన్స్‌పోర్ట్ ఖర్చు లేకుండా రైతు సమ-యం వృధా కాకుండ గ్రామంలోనే ఎరువులు అందిచాం. నాలుగు రోజుల నుండి ఇక్కడికి వచ్చి ఉంటే ఒక్క బస్తా ఇస్తామని చెప్పడం బాధాకరం. దేవుడు దర్శనం దొరుకుతుంది కానీ ఎరువుల బస్తా దొరకడం లేదని మహిళా రైతు భాగ్యమ్మ చెప్పడం ఈ ప్రభుత్వం రైతుల పట్ల చిన్న చూపునకు నిదర్శనం. వెంటనే ఓటీ-పీ విధానం, ఒక బస్తా విధానంను తీసేయాలని డిమాండ్ చేశారు. రైతుల అవసరాలకు అనుగుణంగా ఎర-వుల బస్తాలు ఇవ్వాలని డిమాండ్ హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

మళ్ళీ పాత రోజులు వచ్చాయి.. ఇదేనా కాంగ్రెస్ మార్పు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ రైతు వ్యతిరేక ప్రభుత్వం, నానో యూరియా వాడాలని చెప్పడం రైతులపై 500 రూ. అదనపు భారం వేయడమే. నానో యూరియ తో రైతులకు ఎకరానికి రూ. 500లు భారం పడుతుంది. ప్రభుత్వం సబ్సిడీ నుండి తప్పించుకోడానికి కృత్రిమ ఎరువులను సృష్టిస్తుంది. ఎన్నికలు ఉన్నాయని బీహార్‌కు ఎర-వులను తరలిస్తున్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రభుత్వం సబ్సిడీ నుంచి తప్పించుకునేందుకు కృత్రిమ కొరతను సృష్టిస్తోందని విమర్శించారు. ఎన్నికలు ఉన్నాయని బిహార్‌కు ఎరువులు తరలిస్తున్నారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, భాజపాకు గుణపాఠం చెప్పాలన్నారు.

బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణపై విచారణ

మొదటి పేజీ తరువాయి

న్యూఢిల్లీ,ఆగస్ట్13(పద్మక్రాంతి):

బీహార్‌లో ఓటర్ల జాబితాను సవరించాలనే ఎన్నికల కమిషన్ నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు బుధవారం మ-రోసారి విచారించింది. ఈ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చీ ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. గతంలో ఏడు ధ్రువీకరణ పత్రాలకంటే.. ప్రస్తుతం 11 పత్రాలను అనుమతించడం ఓటర్లకు ప్రయోజనకరంగా ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. ఆధార్ మినహా అనేక ఇతర డాక్యుమెంట్లను పరిగణలోకి తీసుకోవడాన్ని ధర్మాసనం గుర్తు చేసింది. గతంలో బిహార్‌లో నిర్వహించిన రివిజన్‌లో ఏడు ధ్రువీకరపత్రాలను అనుమతించారని.. ప్రత్యేక సవరణలో 11 డాక్యుమెంట్లను ఈసీ అనుమతి ఇస్తుందని.. దీన్ని పరిశీలిస్తే ఓటర్లకు అనుకూలంగానే కనిపిస్తుందని ధర్మాసనం తెలిపింది. ఆధార్ అనుమతించడం లేదనే పిటిషనర్ల వాదనను అర్థం చేసుకున్న ప్పటికీ అనేక పత్రాలను పరిగణలోకి తీసుకుంటున్నట్లుగా ధర్మాసనం గుర్తు చేసింది. అయితే, ఈ వాదనలతో పిటిషనర్ తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ విభేదించారు. ధ్రువపత్రాల సంఖ్య ఎక్కువగా ఉన్నా.. అందరికీ అందుబాటులో లేవని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పాస్‌పోర్టులను ఉదహరించారు. బిహార్‌లో కేవలం ఒకటి నుంచి రెండుశాతం మంది వద్దే పాస్ పోర్టులు ఉన్నాయన్నారు. దీనికి స్పందించిన ధర్మాసనం 36లక్షల మందికి పాస్‌పోర్టులు ఉన్నాయని.. ఇది మంచి సంఖ్యగానే కనిపిస్తోందని చెప్పింది. ఆయా ప్రభుత్వ విభాగాల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్న తర్వాతే ధ్రువపత్రాల జాబితా రూపొందిస్తారని జస్టిస్ జోయ్‌మల్య బాగ్చీ తెలిపారు. ఇదిలా ఉండగా.. ఈ అంశంపై మంగళవారం సైతం సుప్రీంకోర్టులో విచారణ జరిగిన విషయం తెలిసిందే. పౌరులను చేర్చడం, కానివారిని ఓటరు జాబితా నుంచి మినహాయించడం ఎన్నికల కమిషన్ అధికార పరిధిలోనిదని ధర్మాసనం పేర్కొంది. సర్‌లో ఆధార్, ఓటర్ కార్డును పౌరసత్వానికి రుజువుగా పరిగణించలేమన్న ఈసీ వాదనలను సమర్థించింది. పార్లమెంట్ లోపల, వెలుపల 'సర్' అంశంపై వివాదం పెరుగుతున్న నేపథ్యంలో.. ఈసీ చేపట్టిన ఈ కార్యక్రమంపై విశ్వాసం కోల్పోవడమే సమస్య అని.. అంతకు మించి ఏమీ లేదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకం రద్దు

మొదటి పేజీ తరువాయి

నేతలు సుప్రీంను కోరారు. ఈ మేరకు బుధవారం విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం.. ఆగస్టు 14, 2024 తీర్పులో మార్పులు చేస్తూ.. వారి నియామకం చెల్లదని తీర్పును వెలువరించింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 17వ తేదీకి వాయిదా వేసింది.

తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరామ్, అమీర్ అలీఖాన్ నియామకాలపై సర్వోన్నత న్యాయస్థానం స్టే విధించింది. వారి నియామకాలను నిలిపివేస్తూ తీర్పు ఇచ్చింది. తదుపరి ఉత్తర్వులకు అనుగుణంగా ఎంపిక ఉండాలని పేర్కొంటూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ధర్మాసనం సవరించింది. మధ్యంతర ఉత్తర్వుల తర్వాత ప్రమాణస్వీకారం చేయడం తప్పు అని సుప్రీంకోర్టు పేర్కొంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక గవర్నర్ కోటాలో కోదండరామ్, ఆమీర్ అలీఖాన్ నియామకమైన విషయం తెలిసిందే. ఇద్దరిని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నామినేట్ చేసింది. అయితే, దీన్ని సవాల్ చేస్తూ బీఆర్‌ఎస్ అప్పటి ఎమ్మెల్సీ అభ్యర్థులు దాసోజు శ్రావణ్, సత్యనారాయణ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఆయా పిటిషన్లపై విచారించిన సుప్రీంకోర్టు.. ఎమ్మెల్సీలుగా కోదండ రామ్, ఆలీఖాన్ ప్రమాణ స్వీకారాన్ని తప్పుపట్టింది. గతంలో ఇద్దరు ఎమ్మెల్సీల ఎన్నికపై సుప్రీంకోర్టు స్టే విధించిన విషయం తెలిసిందే. తదుపరి ఉత్త-ర్వులకు అనుగుణంగా ఎంపిక ఉండాలని మధ్యంతర ఉత్తర్వులు వెలువరించింది. గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ధర్మాసనం సవరించింది. మధ్యంతర ఉత్తర్వుల తర్వాత ప్రమాణస్వీకారం చేయడం తప్పని సుప్రీంకోర్టు పేర్కొంది. ఉత్తర్వులు జారీ చేస్తామని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహత ధర్మాసనం స్పష్టం చేసింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేసీఆర్ ప్రభుత్వం ఎమ్మెల్సీలుగా దాసోజు శ్రావణ్, సత్యనారాయణను ఎమ్మెల్సీలుగా నామినేట్ చేసింది. వీరిద్దరిని అభ్యర్థిత్వాలను అప్పటి గవర్నర్ తమిళసై తిరస్కరించారు. గవర్నర్ అభ్యర్థిత్వాలను తిరస్కరించడంతో శ్రావణ్, సత్యనారాయణ ఇద్దరూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఎన్నికల అనంతరం 2024 జనవరి 13న ప్రొఫెసర్ కోదండ రామ్, అలీఖాన్ పేర్లను రేవంత్‌రెడ్డి సర్కారు ప్రతిపాదించింది. గవర్నర్ వీరిద్దరి అభ్యర్థిత్వాలను ఆమోదించారు. గవర్నర్ నిర్ణయంపై హైకోర్టును ఆశ్రయించారు. కోదండ రామ్, అలీఖాన్ నియామకాలను హైకోర్టు రద్దు చేసింది. ఆ తర్వాత మరోసారి రేవంత్ సర్కారు మళ్లీ అవే పేర్లను గవర్నర్‌కు సిఫారసు చేసింది. గవర్నర్ ఆమోదంతో ఇద్దరు ఎమ్మెల్సీలుగా నియామకమయ్యారు. గవర్నర్ నిర్ణయంపై ఆగస్టు 4న దాసోజు శ్రవణ్, సత్యనారాయణ ఇద్దరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గవర్నర్ కార్యాలయం సైతం సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం కోదండ రామ్, ఆలీఖాన్ ప్రమాణస్వీకారాన్ని తప్పుపట్టింది. అయితే ఈ విషయంపై తాజాగా ఎమ్మెల్సీ ఆమీర్ అలీఖాన్ స్పందించారు. సుప్రీం కోర్టు ఈ విధమైన తీర్పు ఇస్తుందని అనుకోలేదని అసహనం వ్యక్తం చేశా-రు. కోర్టు ఆర్డర్ చదివిన తర్వాత అన్ని మాట్లాడుతానని పేర్కొన్నారు. లాయర్ కాల్ చేసి సుప్రీం కోర్టులో జరిగిన విషయాలు చెప్పారని వివరించారు. తాను మొన్నటి వరకు జర్నలిస్టును అని ఎలాంటి రాజకీయం బ్యాక్ గ్రౌండ్ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తనతో ఇంకా ప్రభుత్వ పెద్దలు మాట్లాడలేదని అలీఖాన్ స్పష్టం చేశారు.

పౌరసత్వం రాకుండానే సోనియాకు ఓటు

మొదటి పేజీ తరువాయి

న్యూఢిల్లీ,ఆగస్ట్13(పద్మక్రాంతి):

భారత పౌరసత్వం లభించకముందే సోనియాకు ఓటర్ల జాబితాలో పేరు ఎలా వచ్చిందని బిజెపి ప్రశ్నించింది. దీనికి కాంగ్రెస్ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేసింది.

భాజపా, ఎన్నికల సంఘం కలిసి ఎన్నికల్లో 'భారీ నేరపూరిత మోసానికి' పాల్పడ్డాయని కాంగ్రెస్ ఆరోపణలు గుప్పిస్తోంది. వాటిని కాషాయ పార్టీ తిప్పి కొట్టింది. ఎన్నికల్లో అవకతవకల గురించి భారీ ప్రసంగాలు, నిరసనలు చేపడుతున్న కాంగ్రెస్ పార్టీ గతంలో ఎన్నో మోసాలకు పాల్పడిందని భాజపా నేత అమిత్ మాలవీయ అన్నారు. కాంగ్రెస్ నేత సోనియా గాంధీ భారత పౌరసత్వం పొందకముందే ఓటర్ల జాబితాలో ఆమె పేరు ఉందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ఈ విధంగా పౌరసత్వం లేని వారికి ఓటు- హక్కు ఎలా కల్పించారో చెప్పాలని ప్రశ్నించారు. భారత ఓటర్ల జాబితాతో సోనియా గాంధీ పేరు చేర్చి అనేక ఉల్లంఘనలకు పాల్పడ్డారని మాలవీయ అన్నారు. 'భారత పౌరసత్వం పొందడానికి మూడేళ్ల ముందు ఎన్నికల జాబితాలో సోనియా గాంధీ పేరు ఉంది.. అప్పటికి ఆమె ఇటాలియన్. ఆ సమయంలో ఓటర్ల జాబితాలో ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, సంజయ్ గాంధీ, మేనకా గాంధీలతో పాటు- సోనియా గాంధీ పేరు కూడా చేర్చారు. ఈ విషయంపై 1982లో నిరసనలు వ్యక్తమవ్వడంతో ఆమె పేరును తొలగించారు. 1983 జనవరిలో తిరిగి చేర్చారు. ఆ ఏడాది ఏప్రిల్ 30న ఆమెకు భారత పౌరసత్వం మంజూరయ్యింది. ఈ విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ప్రవర్తించింది. పౌరసత్వం లేని సోనియా గాంధీ పేరును ఓటరు జాబితాలో చేర్చి ఎన్నికల ఉల్లంఘనలకు పాల్పడిందని అమిత్ మాలవీయ ఆరోపించారు. దీనిపై కాంగ్రెస్ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బిహా-ర్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను వ్యతిరేకిస్తున్న ప్రతిపక్షాలు.. మంగళవారం 'మింతా దేవి' అనే మహిళా ఓటరు ఫొటోతో ఉన్న టీ- షర్టులు ధరించి పార్లమెంట్ వెలుపల నిరసన చేపట్టిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ చేసిన పని వల్ల మీడియా వాళ్లు తమ ఇంటికి వచ్చి ప్రశ్నల మీద ప్రశ్నలు సంధిస్తున్నారని మింతా దేవి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. అనుమతి లేకుండా తమ ఫొటోలను ఎలా ముద్రిస్తారని మండిపడ్డారు. దీనిపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు స్పందిస్తూ.. సాధారణ గృహిణికి సంబంధించిన వివరాలు, ఫొటోలను అనుమతి లేకుండా కాంగ్రెస్ నేతలు బయటకు ఎలా విడుదల చేశారని నిలదీశారు.

రెండేళ్లయినా ఆరు గ్యారెంటీలేవీ

- ఎక్కడికైనా వెళ్లి ప్రజలను అడుగుదామా
- డిప్యూటీ సిఎం భట్టికి కెటిఆర్ సవాల్

హైదరాబాద్,ఆగస్ట్13(పద్మక్రాంతి):



డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం తన ఎక్స్ ఖాతా వేదికగా విమర్శలు గుప్పించారు. అందులోభాగంగా డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్కకు ఆరుగ గ్యారెంటీల వాగ్దానం గుర్తుందా ? అని ప్రశ్నించారు. 100 రోజులు కాదు.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు 2 సంవత్సరాలు అయినా ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను ఇంకా నెరవేర్చలేదంటూ మండిపడ్డారు. ఇచ్చిన హామీలు అమలు చేశామని తెలంగాణలోని ఏ గ్రామానికైనా వెళ్లి చెప్పగలరా? అంటూ డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్కను కేటీఆర్ తన ఎక్స్ ఖాతా వేదికగా సూటిగా ప్రశ్నించారు. ఇప్పటికే అబద్దాలు చెప్పిన మీ నాయకులను ప్రజలు వెంబడిస్తున్నరని ఆగ్రహం వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు- క్యాబినెట్ మంత్రులంతా తెలంగాణలో ఎక్కడికైనా వెళ్లి.. తమ ప్రభుత్వం ఆరు హామీలు నెరవేర్చామని చెప్పాలని ఆయన సూచించారు. మీ అబద్ధాలు, తప్పుడు ప్రచారాలపై ప్రజలు మిమ్మల్ని తరిమికొట్టక పోతే.. నేను రాజకీయాలను విడిచి పెడతానంటూ డిప్యూటీ- సీఎం మల్లు భట్టి విక్రమార్కకు బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీ-ఆర్ సవాల్ విసిరారు.

కాళేశ్వరం జలాశయాలు నింపండి

- వెంటనే మోటర్లు ఆన్ చేసి పంపింగ్ చేయాలి
- మంత్రి ఉత్తమ్‌కు హరీష్ రావు లేఖ

సిద్దిపేట,ఆగస్ట్13(పద్మక్రాంతి):



నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి హరీశ్‌రావు లేఖ రాశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కింద ఉన్న జలాశయాలు నింపాలని అందులో విజ్ఞప్తి చేశారు. మధ్య మానేరు, అన్నపూర్ణ, రంగనాయక్‌సాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ, బస్వాపూర్ జలాశయాలను నింపాలని కోరారు. రైతుల కోసం ఆరో ప్యాకేజీ వద్ద ఉన్న మోటార్లు ఆన్ చేయాలన్నారు. జలాశయాల్లో నీరు నింపకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని పేర్కొన్నారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. వెంటనే కాళేశ్వరం మోటార్లు ఆన్ చేసి రిజర్వాయర్లు నింపాలని లేఖలో పేర్కొన్నారు. రిజర్వాయర్‌లలో నీటిని సకాలంలో నింపకపోవడం వల్ల రైతులు ఆందోళనలో ఉన్నారని చెప్పుకొచ్చారు. ప్రాజెక్టు పరిధిలోని రిజర్వాయర్లను వెంటనే నింపాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ప్యాకేజ్-6 వద్ద మోటార్లను ఆన్ చేసి నీటి పంపింగ్ చేయాలని కోరారు. కేసీఆర్ హయాంలో హమాలీ ఖర్చులు ఇచ్చి ఇంటికి యూరియా పంపించామని గుర్తు చేశారు. ఉదయం నుంచి రైతులు వచ్చి ఇబ్బందులు పడుతుంటే పట్టించుకొనే అధికారి లేరని అగ్రికల్చర్ అధికారులపై సీరియస్ అయ్యారు. పదేళ్లలో లేని కొరత.. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇప్పుడు ఎందుకు వచ్చిందని ప్రశ్నల వర్షం కురిపించారు. ఎరువుల కొరత మూమ్మాటికీ ఈ బీజేపీ , కాంగ్రెస్ ప్రభుత్వాల వైఫల్యమేనని విమర్శించారు. పదేళ్లలో కేసీఆర్ హయాంలో ఎరువుల ఇబ్బంది లేదని చెప్పుకొచ్చారు. ఈ ప్రభుత్వం రైతుల పట్ల చిన్న చూపునకు నిదర్శనమని ఆక్షేపించారు హరీష్‌రావు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

మొదటి పేజీ తరువాయి

ఎమ్మెల్సీలపై సుప్రీం తీర్పు చెంపపెట్టు

శ్రవణ్, సత్యనారాయణల అభ్యర్థిత్వాలకు అడ్డుతగిలిన కాంగ్రెస్, బీజేపీల నిజస్వరూపం మరోసారి బట్టబయలైందని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగంపై ఏమాత్రం గౌరవం లేని ఈ రెండు ఢిల్లీ పార్టీల అప్రజాస్వామిక విధానాలు ఎంతమాత్రం సాగనివ్వమని చాటిచెప్పిన న్యాయవ్యవస్థకు బీఆర్‌ఎస్ పక్షాన శిరస్సు వంచి సలాం చేస్తున్నట్లు కేటీఆర్ స్పష్టం చేశారు.

మీరు దాడి చేస్తే.. బ్రహ్మోస్‌తో జవాబుచెబుతాం

ఇలాంటి బెదిరింపులు భారత్ విషయంలో ఎంతమాత్రం పనిచేయవని స్పష్టం చేశారు. ఇక చాలు అయ్యిందేదో అయిపోయిందని అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. గతంలో పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ 'అణు' హెచ్చరికలు చేయడాన్ని కూడా ఒవైసీ తిప్పికొట్టారు. భారత్ విషయంలో ఆయన మాట్లాడిన మాటలు, వాడిన పదజాలం గర్హనీయమని అన్నారు. అమెరికా వేదిక నుంచి ఆయన ఈ మాటలు మాట్లాడటం దురదృష్టకరమన్నారు.

తెలంగాణ పట్ల కేంద్రం వివక్ష

తెలిపిందన్నారు. అయితే అక్కడ ఇప్పటివరకు ఎలాంటి భూకేటాయింపులు జరగలేదని, ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమైనా వారికి అనుమతులు ఎలా ఇచ్చారంటూ ప్రశ్నించారు. కేంద్రం ఇలాంటి చర్యల వల్ల అంతర్జాతీయ పెట్టు-బడిదారులకు ఏం సందేశం ఇవ్వాలనుకుంటుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇలాంటి రాజకీయ నిర్ణయాలు తెలంగాణ అభివృద్ధికి తీవ్ర ఆటంకం కలిగిస్తున్నాయని, కేంద్ర వ్యవహారశైలిని రాష్ట్ర ప్రభుత్వం తూర్పారబడుతుందన్నారు.

ఐసిఐసిఐ బ్యాంక్ యూటర్న్

న్యూఢిల్లీ,ఆగస్ట్13(పద్మక్రాంతి):

ప్రముఖ ప్రైవేటు రంగ బ్యాంక్ ఐసీఐసీఐ యూటర్న్ తీసుకుంది. రూ.50వేల కనీసం బ్యాలెన్స్ ఉండాలన్న నిబంధనపై వెనక్కి తగ్గింది. ఇటీవలి నిర్ణయంపై పెద్దఎత్తున విమర్శలు రావడంతో తన నిర్ణయం మార్చుకుంది. ఈ మేరకు కనీస సగటు- బ్యాలెన్స్ మొత్తాలను సవరించింది. మెట్రో,అర్బన్ ఖాతాదారులు రూ.15,000 నెలవారీ సగటు- బ్యాలెన్స్ కలిగి ఉండాలని పేర్కొంది. సెమీ అర్బన్ ప్రాంతాల్లో అయితే రూ.7,500 ఉండాలన్న నిబంధన విధించింది. గ్రామీణ ఖాతాదారులకు మాత్రం ఎప్పటిలానే రూ.2,500 సగటు మినిమమ్ బ్యాలెన్స్ ఉంచితే సరిపోతుందని పేర్కొంది. పొదుపు ఖాతాల్లో కనీస నిల్వ లేనిపక్షంలో విధిస్తున్న అపరాధ రుసుమును ప్రభుత్వరంగ బ్యాంకులు పూర్తిగా ఎత్తివేయగా.. ఐసీఐసీఐ బ్యాంక్ మాత్రం అందుకు భిన్నంగా ఖాతాదార్లకు ఇటీవల షాకిచ్చిన విషయం తెలిసిందే. పొదుపు ఖాతాల్లో కనీస నిల్వ మొత్తాన్ని భారీగా పెంచుతూ నిర్ణయం తీసుకుంది.ఆగస్టు 1 తర్వాత ఖాతా తెరిచిన వారికే వర్తిస్తుందని స్పష్టంచేసింది. మెట్రో, అర్బన్ ప్రాంతాల్లో ఖాతాదార్ల కనీస నిల్వ పరిమితిని రూ.50 వేలకు పెంచేసింది. గతంలో ఈ మొత్తం రూ.10 వేలుగా ఉండేది. సెమీ అర్బన్ ఖాతాదార్ల కనీస నిల్వ మొత్తాన్ని రూ.5 వేల నుంచి రూ.25 వేలకు పెంచింది. గ్రామీణ ఖాతాదార్లకు రూ.2,500 నుంచి రూ.10 వేలకు సవరించింది. దీనిపై ఆర్‌బీఐ జోక్యం చేసుకోనప్పటికీ.. పౌరుల నుంచి మాత్రం పెద్దఎత్తున విమర్శలు వ్యక్తమయ్యాయి. దీంతో ఈ మొత్తాలను స్వల్పంగా సవరిస్తూ తాజా నిర్ణయం తీసుకుంది.

సావర్కర్, గాడ్సే భావజాలం వారితో ప్రమాదం

పోలీసులు గతంలో తేల్చారు. దీనిపై పుణెలోని ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణ ఇంకా ప్రారంభం కావాల్సి ఉంది. ఈ క్రమంలోనే రాహుల్ గాంధీ తరఫు న్యాయవాది కోర్టుకు తాజాగా ఓ వినతిపత్రం సమర్పించారు. తనకు నాథూరాం గాడ్సే, సావర్కర్ కుటుంబాలతో సంబంధం ఉందని సాత్యకి గతంలో వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఆయన గత చరిత్రను దృష్టిలో పెట్టుకుని, ప్రస్తుత రాజకీయ వాతావరణాన్ని పరిగణనలోకి తీసుకుంటే.. సావర్కర్, గాడ్సే భావజాలానికి మద్దతు ఇచ్చే వ్యక్తుల నుంచి రాహుల్ గాంధీకి ముప్పు పొంచి ఉండే అవకాశాలను కొట్టిపారేయలేం. ఇటు-వంటి పరిస్థితుల్లో ఆయనకు రక్షణ కల్పించడం రాజ్యాంగబద్ధమైన బాధ్యతని అందులో పేర్కొన్నారు. విచారణను ఆలస్యం చేయాలనే ఉద్దేశంతోనే రాహుల్ గాంధీ ఈ అప్లికేషన్‌ను దాఖలు చేశారని సాత్యకి సావర్కర్ ఆరోపించారు. అందులో పేర్కొన్న వాస్తవాలకు, ప్రస్తుత కేసుతో ఎటు-వంటి సంబంధం లేదని మీడియాతో అన్నారు. ఇదిలా ఉండగా.. ఈ కేసులో రాహుల్ గాంధీకి కోర్టు ఇప్పటికే బెయిల్ మంజూరు చేసింది.

భారీ వర్షాల నేపథ్యంలో బయటకు రావద్దు

ప్రజలకు ఆయన సూచించారు. బుధవారం హైదరాబాద్‌లో రంగనాథ్ మాట్లాడుతూ.. ఎంతటి విపత్తు ఎదురైనా.. వాటిని ఎదుర్కొనేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్, జలమండలి, విద్యుత్ అధికారుల సమన్వయం తో పని చేస్తున్నామని ఆయన వివరించారు. అలాగే లోతట్టు- ప్రాంతాల్లో భారీగా వరద నీరు వస్తే.. ప్రజలను రక్షించేందుకు బోట్స్‌తో సహా అన్నింటిని సిద్ధం చేశామని చెప్పారు. అయితే రాత్రి సమయంలో వర్షపాతం అధికంగా నమోదయ్యే అవకాశాలు ఉండడంతో.. రాత్రి నుంచి హైడ్రా బృందాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. నాలాల కబ్జాల కారణంగానే రహదారులపైకి భారీగా వరద నీరు వస్తుందని ఆయన తెలిపారు. ఇక ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో దాదాపు 400కి పైగా వాటర్ లాగింగ్ పాయింట్స్ ఉన్నాయన్నారు. అలాగే మేజర్ వాటర్ లాగింగ్ పాయింట్స్ వద్ద ఇప్పటికే సిబ్బంది ఉన్నారన్నారు. ఒక వేళ భారీ వర్షాలు కురిస్తే.. సహాయక చర్యల్లో పాల్గొనాలని యువతకి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు.

ఎపి హైకోర్టులో నలుగురు కొత్త జడ్జిల ప్రమాణం

అమరావతి,ఆగస్ట్13(పద్మక్రాంతి):



ఎపి హైకోర్టు న్యాయమూర్తులుగా బుధవారం నలుగురు న్యాయమూర్తులు ప్రమాణ స్వీకారం చేశారు. జస్టిస్ నూనేపల్లి హరినాథ్, జస్టిస్ మండవ కిరణ్మయి, జస్టిస్ జగడం సుమతి, జస్టిస్ న్యాపతి విజయ్ లు ప్రమాణస్వీకారం చేశారు. వీరందరితో హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా సీజే నలుగురు న్యాయమూర్తులకు అభినందనలు తెలిపారు. జస్టిస్ కిరణ్మయి, హరినాథ్, సుమతి, విజయ్ లు 2023 అక్టోబర్ 21 న హైకోర్టు అదనపు న్యాయ మూర్తులుగా నియమితులయ్యారు. అయితే వారి పదవీ కాలం అక్టోబర్ 20 న ముగియనుంది. ఈ నేపథ్యంలోనే వారిని హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా నియమించాలంటూ ఇటీ-వల సుప్రీం కోర్టు కొలీజియం సిఫారసు చేసింది. ఈ పరిణామంతో హైకోర్టులో శాశ్వత న్యాయమూర్తుల సంఖ్య మొత్తం 24కి చేరింది.

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
తెలుగు దినపత్రిక

పీర్జాదిగూడలో "టాస్కా" కార్యాలయం ప్రారంభోత్సవం

ముఖ్యఅతిథిగా పాల్గొన్న "టాస్కా" రాష్ట్ర అధ్యక్షుడు పి నరసింహారావు
వయోవృద్ధులకు అండగా తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్

మేడిపల్లి,ఆగస్టు 13,పద్మక్రాంతి:

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ లో తెలంగాణ ఆల్ సీనియర్స్ సిటిజన్స్ అసోసియేషన్ మేడిపల్లి యూనిట్ నూతన కార్యాలయ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి నరసింహారావు,ఉపాధ్యక్షురాలు కే సావిత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ముఖ్య అతిథులు మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఏర్పడే సమస్యలను పరిష్కరించడానికి, వయోవృద్ధులకు రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాపాడుతూ,వృద్ధులు ఒంటరితనంగా భావించకుండా సహచరులతో కలిసి ఆనందంగా గడిపేందుకు,తమ పిల్లలనుండి ఏర్పడే సమస్యలను పరిష్కరిస్తూ వారికి అండగా నిలబడేందుకు తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ 2016లో ఏర్పాటు చేయబడిందని,రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండలాలలో డివిజన్లో శాఖలు ఏర్పాటు చేసిందని అన్నారు. ముఖ్యంగా వయోవృద్ధులు తమ జీవిత అనుభవాలను,విలువైన సమయాన్ని మంచి సమాజ నిర్మాణానికి ఉపయోగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ మేడిపల్లి అధ్యక్షుడు సురకాంతుల చిరంజీవి రావు, సెక్రెటరీ సల్ల సురేందర్, కోశాధికారులు జెట్టి శివకుమార్, కాల్వకోలను సావిత్రి,సలహాదారులు ఆకుల మోహన్ రావు,దేవలపల్లి వేణుగోపాలరావు,మేకల బాల్ రెడ్డి, ఉపాధ్యక్షులు చంద్ర లలిత,కాకి వెంకట్ రెడ్డి,దాసరి రాజు, జాయింట్ సెక్రెటరీ మెరుగు కృష్ణయాదవ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రెముల శ్రీరాములు గౌడ్,మల్లాది వెంకట్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు జాగర్లమూడి వెంకటేశ్వర్రావు,గుగులోతు శాంత, తదితరులు పాల్గొన్నారు.

పీర్జాదిగూడలో ముంపు ప్రాంతాలకు శాశ్వత పరిష్కారం చూపండి

- **మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం ఇచ్చిన బిజెపి శ్రేణులు**
- **యుద్ధ ప్రాతిపదికన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి చేయాలి**
- **పీర్జాదిగూడ వెస్ట్ బిజెపి అధ్యక్షుడు, రాంపల్లి యాదగిరి గౌడ్**

మేడిపల్లి,ఆగస్టు 13,పద్మక్రాంతి:

గత కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాలు జలమయమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో వరదలకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి పీర్జాదిగూడ వెస్ట్ బీజేపీ అధ్యక్షుడు రాంపల్లి యాదగిరి గౌడ్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ త్రిలోకేశ్వర్ రావు కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాదగిరి గౌడ్ మాట్లాడుతూ గత 7 సంవత్సరాలుగా విష్ణుపురి కాలనీ,గణేష్ నగర్,శ్రీ రామ ఆర్మీస్ కాలనీ,చెన్నారెడ్డి ఎంక్లేవ్,శ్రీపాద ఎంక్లేవ్,భవాని కాలనీలో చిన్న వర్షానికి నీట మునిగి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పాలకులు,అధికారులు మారుతున్నారు తప్ప ప్రజల జీవితాలు మారడం లేదని,భూగర్భ డ్రైనేజీ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, వరదలతో నష్టపోతున్న ప్రజలకు నిత్యావసర సరుకులు, మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని కమిషనర్ కు విన్నవించామని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు నల్ల భాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మల్లెల సంతోష్, ఉపాధ్యక్షురాలు మాధవి లత, వెంకటేష్ గౌడ్,బుర్ర శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాల నేపథ్యంలో బోడుప్పల్లో అత్యవసర సమావేశం

- **అన్ని విభాగాల అధికారులకు మున్సిపల్ కమిషనర్ దిశా నిర్దేశం**
- **ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ శైలజ విజ్ఞప్తి**
- **బోడుప్పల్ కంట్రోల్ రూమ్ నెంబర్ : 040-27215959**

మేడిపల్లి,ఆగస్టు13,పద్మక్రాంతి:

గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో,రాబోయే 72 గంటలలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన సందర్భంగా బోడుప్పల్ కమిషనర్ ఎ. శైలజ ఆధ్వర్యములో పోలీస్,రెవెన్యూ,ఇరిగేషన్,హెల్త్, హైడ్రా అధికారులతో ప్రత్యేక అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. కార్పొరేషన్ పరిధిలోని నీటి ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలని,ప్రజలకు ముందు జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పించడం,అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయం అందించడం, ప్రమాద ప్రాంతాల గుర్తింపు,రక్షణ బృందాల సిద్ధం వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు. అదే విధంగా కార్యాలయముల్లో ఎమర్జెన్సీ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. అత్యవసర సమయంలో ప్రజలు కంట్రోల్ రూమ్ నెంబర్ : 040-27215959 ను సంప్రదించాలని కమిషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మేడిపల్లి మండలం తహసీల్దార్ హసీనా, మేడిపల్లి సిఐ గోవింద రెడ్డి, ఇరిగేషన్ శాఖ నుండి అసిస్టెంట్ ఇంజనీర్ పరమేష్,బోడుప్పల్ అసిస్టెంట్ ఆఫీసర్ ప్రణీత్,హైడ్రా అధికారులు,అసిస్టెంట్ మునిసిపల్ కమీషనర్ శ్యామ్ సుందర్ రావు, మునిసిపల్ అధికారులు,వార్డ్ ఆఫీసర్స్,వార్డ్ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

- **కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్.**

కొమరం భీమ్ ఆసిఫాబాద్, ఆగస్టు 13,(పద్మక్రాంతి ప్రతినిధి):

జిల్లాలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు,ప్రాణహిత నది పర్యవాక ప్రాంతాల్లో ఉండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. లో లెవెల్ బ్రిడ్జిలను దాటే ప్రయత్నం చేయవద్దు అని తెలిపారు. భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,వరద ప్రభావం ఉన్న వంతెనలు, రహదారులపై నుండి ప్రజలు దాటవద్దని, జలాశయాలు చెరువులు, కుంటలను చూడడానికి వెళ్లకూడదని తెలిపారు. శిధిల వ్యవస్థలో ఉన్న ఇండ్లలో నివాసం ఉండవద్దని,తడిగా ఉన్న కరెంటు పోల్స్,ట్రాన్స్ఫార్మర్ తాగవద్దని, గ్రామాలలో చేపల వేటకు ఎవరు వెళ్లవద్దని, రైతులు పొలాల్లో విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తలు వహించాలని, నీరు నిల్వ ఉన్న విద్యుత్ స్తంభాల దగ్గర కి వెళ్ళరాదని, వాటర్ ఫాల్స్ లాంటి ప్రాంతాలను సందర్శించవద్దని తెలిపారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఎవరూ బయటకు రావద్దని, వరద ప్రవాహాల వద్ద బంద వస్తున్న పోలీస్ సిబ్బంది సూచనలు పాటించి, పోలీసు వారికి సహకరించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు, ఎటువంటి విపత్కర పరిస్థితులు ఎదురైన వాటిని ఎదుర్కొనేందుకు జిల్లా పోలీస్ శాఖ సిద్ధంగా ఉందని,ముంపు ప్రాంతాల ప్రజలకు తక్షణ సహాయం కోసం జిల్లా విపత్తు ప్రతిస్పందన దళాలు (డిడిఆర్ఎఫ్) బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా పాలన యంత్రాంగం పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖ, రెస్క్యూ సిబ్బంది అందుబాటులో ఉంటారని అన్నారు. విపత్కర పరిస్థితులు ఎదురైతే ప్రజలు పోలీస్ శాఖ సహాయం తీసుకోవాలని డయల్ 100 లేదా 8712670551 నెంబర్ ని సంప్రదించాలని తెలిపారు. జిల్లాలో ఎలాంటి ప్రమాదాలు వాటిల్లకుండా పోలీసు వారు చేపట్టే చర్యలకు ప్రజలు సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

పెండింగులో ఉన్న ఈపీఎఫ్ , ఈఎస్ఐ పూర్తి వివరాలు తెలియజేయాలి.

- **ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్.**

కొమరం భీమ్ ఆసిఫాబాద్, ఆగస్టు 13,(పద్మక్రాంతి ప్రతినిధి):

కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ మాట్లాడుతూ జిజిహెచ్ లో పనిచేస్తున్న శానిటేషన్,పేషంట్ కేర్,సెక్యూరిటీ సిబ్బందికి గత మూడు(2022) సంవత్సరాల నుండి పెండింగ్లో ఉన్న పిఎఫ్,ఈఎస్ఐ పూర్తి వివరాలు తెలియజేయాలని, అలాగే పెండింగ్లో ఉన్న వేతనాలు చెల్లించాలని కోరుతూ ప్రభుత్వ ఆసుపత్రి ముందు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనేకసార్లు డిసిహెచ్ఎస్ చెన్నకేశవ ని మరియు ఇప్పటి జిజిహెచ్ సూపరిండెంట్ ని కలిసినప్పటికీ రేపు మాపు అంటూ కాలయాపన చేసారే తప్ప సమస్యలు పరిశీలించడం లేదని అన్నారు. ఇప్పటికైనా చెన్నకేశవ పై జిల్లా కలెక్టర్ విచారణ జరిపి క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం 26,000 చెల్లించాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కాంట్రాక్టు వ్యవస్థను రద్దుచేసి కార్పొరేషన్ లేదా గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు, ప్రతినెల 5వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలని,కాంట్రాక్టర్ తో అప్పటి సూపరెంటెంట్ డిసిహెచ్ఎస్ చిన్న కేశవ కుమ్మక్కయి కార్మికులకు అన్యాయం చేశారని ఆరోపించారు అని అన్నారు. ఇప్పటికైనా చిన్న కేశవ పై విచారణ జరిపి క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు టి.దివాకర్, ఉపాధ్యక్షుడు చిరంజీవి,మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ)జిల్లా కార్యదర్శి మల్లేష్,కార్మికులు మురళి,నవీన్, మమత, గంగన్న, గుణవత్, సౌజన్య,సోనీ, హైమద్, జ్ఞానేశ్వర్, కమలాకర్, శ్రీకాంత్, చందు, ఫేహీమా, రూప,విమల, నిరోష, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు టి. దివాకర్, ఉపాధ్యక్షుడు చిరంజీవి తోపాటు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలి

పద్మక్రాంతి, ఆగస్టు 13(కల్వకుర్తి ప్రతినిధి):

కల్వకుర్తి పట్టణంలో అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆంజనేయులు సిపిఎం సీనియర్ నాయకులు బాల్ రెడ్డి.ఏపీ. మల్లయ్య.పరుశురాములు అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని సుభాష్ నగర్ ఏడవ వార్డు.ఎనిమిదో వార్డులో.సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి పర్యటించిన సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదవారికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే కార్యక్రమంలో సక్రమంగా సర్వే జరగలేదని అన్నారు. దొడ్డి లక్ష్మమ్మ కు 50.60 సంవత్సరాల క్రితం ఇందిరమ్మ ఇంటి స్థలం వారి పూర్వీకులకు అత్తమామలకు వస్తే ఆ స్థలంలో రేకుల ఇల్లు శిథిలావస్థకు చేరుకున్నదని ఆమె భర్త చనిపోయారని అదేవిధంగా ఆమె కూతురు భర్త కూడా చనిపోయారని ఆమె కూతురు పిల్లలను లక్ష్మమ్మ కొడుకు మున్సిపాలిటీలో ఔట్సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికునిగా పనిచేస్తూ కుటుంబాన్ని నడుపుతున్నాడని ఇల్లు కట్టుకోవడానికి ఇంద్రమ్మ ఇల్లు సాంక్షన్ కాలేదని అదేవిధంగా గద్ద భారతమ్మకు రెండు రూముల రేకుల ఇల్లు ఖాళీ స్థలం ఉన్నదని ఆమెకు ఇద్దరు కుమారులు ఒక కూతురు భర్త, పెళ్లీడుకొచ్చిన పిల్లలతో పెద్ద కుటుంబం ఇల్లు కట్టుకుందామంటే ఆమె ప్రభుత్వ ఉద్యోగి అని ఆన్లైన్లో చూపిస్తున్నదని అధికారులు చెప్పటం జరిగిందని ఇంకా పట్టణంలో చాలామంది ఇల్లు లేని పేదలు ఇంటి స్థలం ఉండి కట్టుకోవడానికి సిద్ధంగా ఉన్న వారందరికీ ఇంటి నిర్మాణం ఇందిరమ్మ ఇండ్లు శాంక్షన్ చేయాలని అందుకని సమగ్ర విచారణ జరిపి అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో జగన్.చంద్రయ్య.కాలనీవాసులు ఉన్నారు.

ఎరువులను ఎంఆర్ పి ధరల కంటే అధికంగా విక్రయిస్తే కఠిన చర్యలు

- రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారిణి ఉషా

పద్మక్రాంతి ఆగస్టు 13 (చేవేళ్ల, ప్రతినిధి):

ఎరువులను ఎంఆర్ పి ధరల కంటే అధికంగా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారిణి ఉషా ఫర్టిలైజర్స్ డీలర్లను హెచ్చరించారు. మొయినాబాద్ మండల పరిధిలోని వివిధ ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి ఉషా మొయినాబాద్ మండల వ్యవసాయ అధికారిణి అనురాధతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా వెంకటాపూర్ శ్రీలక్ష్మి ఫర్టిలైజర్, మొయినాబాద్ మాన గ్రోమోర్ సెంటర్, పాక్స్ సురంగల్, రాజరాజేశ్వరి ఫర్టిలైజర్స్, మొయినాబాద్ శ్రీబాలాజీ ఫర్టిలైజర్స్ ఉన్నాయి. తనిఖీల సందర్భంగా రిజిస్టర్లు, బిల్ బుక్స్, స్టాక్ %ు% ధరల ప్రదర్శన బోర్డులు, గ్రౌండ్ బ్యాలెన్స్, గోదాములు, లైసెన్స్ చెల్లుబాటు పరిశీలించారు. రైతులకు ఎరువుల ఎంఆర్ పి ధర మరియు అమ్మక ధర గురించి డీలర్లను విచారించారు. డీలర్లు ఎంఆర్ పి ధరకు విరుద్ధంగా అమ్మకాలు చేయరాదు లేనిచో కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నియమ, నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే యూరియాను కేవలం వ్యవసాయ అవసరాలకే విక్రయించాలి తప్ప ఇతర వాణిజ్య అవసరాలకు ఇవ్వరాదన్నారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి పంటలకు ఎంత యూరియా వాడుతున్నారు, ఇంకా ఎంత అవసరం ఉందో వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు యూరియా స్టాక్ గురించి ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. సమయానికి సరిపడా స్టాక్ సరఫరా జరుగుతోందని ఆమె తెలిపారు.

నిరశ్రూరాలైన టేకం సరోజ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

- **బిజెపి జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులు గౌడ్**

రెబ్బెన, ఆగస్టు 13, (పద్మక్రాంతి):

కొమరం భీమ్ జిల్లా రెబ్బెన మండలం గోలేటి గ్రామంలో మంగళవారం రాత్రి నుండి కురిసిన భారీ వర్షాలకు రేకులగూడెం కు వరద ముప్పు తో గూడెంలోని ఇండ్లలోకి నీరు చొప్పుకు వచ్చిందని విషయం తెలుసుకున్న బిజెపి జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులు గౌడ్ సందర్శించిన అనంతరం మాట్లాడుతూ.. రేకులగూడెం కు చెందిన టేకం సరోజ ఇల్లు వర్షంతో ఇంటి సామాగ్రి పూర్తిగా కొట్టుకపోవడంతో నిరాశ్రై దిక్కుతోచని స్థితిలో ఉన్నదని రెబ్బెన తాసిల్దార్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. విషయం తెలుసుకున్న వెంటనే రెబ్బెన సీఐ, ఎస్ఐ పరిస్థితి సందర్శించడం జరిగింది. ప్రభుత్వం వెంటనే స్పందించి సరోజ కుటుంబాన్ని ఆదుకొని ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేయాలని, కల్వర్టు అడ్డంగా చిన్న కల్వర్టు ఉండడంతో నీరు పూర్తిస్థాయిలో వెళ్లకపోవడంతో గ్రామం ముంపుకు గురవుతుందని వెంటనే మరమ్మత్తులు చేసి గూడెం ప్రజలను వారి ఇళ్లను కాపాడాలని అన్నారు. గూడెం సందర్శించిన పోలింగ్ బూత్ అధ్యక్షులు నంది శేఖర్, సిపిఐ నాయకులు ఎర్రం తిరుపతి, మద్దెల సురేందర్ రాజు, దుప్పనాయక్, తిరుపతి, నాగవెల్లి సుధాకర్, భీమన్న, కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సంజయ్, తదితరులు పాల్గొన్నారు.

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
తెలుగు దినపత్రిక

భారీ వర్షాలకు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

- శంకర్ పల్లి పురపాలక సంఘం కమిషనర్ ఏ.యోగేష్

పద్మక్రాంతి ఆగస్టు 13 (చేవేళ్ల, ప్రతినిధి):

రెండు మూడు రోజులపాటు ప్రారంభించి భారీ అతి భారీ వర్షాలు ఒసే అవకాశం ఉన్నందున అత్యవసరం అయితే తప్ప ప్రజలు నుండి బయట రాకుండా అప్రమత్తంగా ఉండాలని పురపాలక సంఘం కమిషనర్ ఏ యోగేష్ అన్నారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని, మరియు వాహనాలు మీద వెళ్లే ప్రయాణికులు జాగ్రత్తగా ఉండాలని ఆయన తెలియజేశారు. అదేవిధంగా చెట్ల క్రింద వాహనాలను నిలుపరాదని ఆయన తెలిపారు.ప్రజలు అందరు అప్రమత్తంగా ఉండాలని, పట్టణ పరిధిలో ఎవైన శిథిలావస్థకు గురైన భవనములు ఉన్నచో ఏవైనా ఇబ్బందికర సంఘటనలు ఏర్పడినట్లయితే శంకర్ పల్లి మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన టోల్ ఫ్రీ నెంబర్ 8897600207 ని సంప్రదించగలరు.

పోగొట్టుకున్న ఫోన్లు అందజేత...

పాపన్నపేట. ఆగస్టు. 13 (పద్మక్రాంతి)

ఎక్కడైనా ఫోన్ పోగొట్టుకున్న, దొంగలించబడిన వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయాలని ఎస్సై శ్రీనివాస్ గౌడ్ అన్నారు.ఇటీవల వివిధ ప్రాంతాలలో సెల్ ఫోన్ పోగొట్టుకున్న మండలానికి చెందిన ఎనిమిది ఫోన్లు సీఈఐఆర్ వెబ్ సైట్ ద్వారా రికవరీ చేసినట్లు తెలిపారు.బుధవారం ఠాణాలో ఎనిమిది మందికి ఫోన్లు అందజేశారు.సీఈఐఆర్ ద్వారా ఇప్పటి వరకు చాలా ఫోన్లు రికవరీ చేసినట్లు పేర్కొన్నారు.పోలీసు సిబ్బంది, తదితరులున్నారు.

టీజీ ఎస్ ఆర్టిసి ఔట్సోర్సింగ్ కాంట్రాక్టర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కేసరి ఆంజనేయులు గౌడ్ నియామకం

రెబ్బెన, ఆగస్టు 13, (పద్మక్రాంతి):

టీజీ ఎస్ ఆర్టిసి ఔట్సోర్సింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర నూతన కమిటీలో రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కేసరి ఆంజనేయులు గౌడ్ ని నియమించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. నాపై విశ్వాసం ఉంచి అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షులు జాయిన్ బాబు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సూర్య ప్రకాష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాస సుభాష్ కి ధన్యవాదములు తెలిపారు. కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, కార్మికుల సమస్యల పరిష్కారానికి నా వంతు కృషి చేస్తానని తెలిపారు.

మృత దేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ

పద్మక్రాంతి, ఆగస్టు 13, (కల్వకుర్తి ప్రతినిధి):

వంగూర్ మండలనికి చెందిన కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సీనియర్ నాయకుడు ఎండి షరీఫ్ ఖాన్ కిడ్నీ సంబంధిత వ్యాధి తో బాధపడుతూ బుధవారం ఉదయం మరణించాడు.విషయం తెలుసుకున్న ఎమ్మెల్యేవారి స్వగృహానికి వచ్చి మృత దేహానికి నివాళులర్పించిన అనంతరంఎమ్మెల్యేమాట్లాడుతూ. షరీఫ్ చనిపోవడం కాంగ్రెస్ పార్టీకి ఆయన కుటుంబానికి తీరనిలోటని ఆయన కరుడుగట్టిన కాంగ్రెస్ వాది ఎంతో పేరుసంపాదించుకున్నాడని ఆయన పార్టీ చేసిన సేవలు ఎప్పుడు గుర్తుంటాయని ఆయన అన్నారు కుటుంబ సభ్యులను పరామర్శించిన ఓదార్చారు.

ఆయన వెంట మాజీ.ఎంపిటీసీ రమేష్ గౌడ్. సిహెచ్ రమేష్ గౌడ్. దేవాలయ చైర్మన్ శేఖర్. జనార్ధన్ ముస్లిం మత పెద్దలు మైనార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

డ్రగ్ రహిత సమాజంకై అందరి భాగస్వామ్యం కావాలి

- డిప్యూటీ ట్రాన్స్ స్పోర్టు కమీషనర్ సదానందం

పద్మక్రాంతి ఆగస్టు 13 (రాజేంద్రనగర్, ప్రతినిధి):

డ్రగ్ రహిత సమాజంకై అందరి భాగస్వామ్యం కావాలని డిప్యూటీ ట్రాన్స్ స్పోర్టు కమీషనర్ సదానందం అన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని రవాణా శాఖ కార్యాలయంలో వాహనదారులతో డీటిసీ సదానందం బుధవారం ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా ఆయన వాహన దారులతో మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయిస్తూ నేను మాదక ద్రవ్యాల పై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామిని అవుతానని, డ్రగ్స్ రహిత జీవనశైలిని అనుసరిస్తూ నాతోపాటు ఏ ఒక్కరూ డ్రగ్స్ బారిన పడకుండా ఉండటానికి కృషి చేస్తానని డ్రగ్స్ అమ్మకం కొనుగోలు అక్రమ రవాణా చేసి వ్యక్తుల సమాచారాన్ని నిబద్ధత అధికారులకు తెలియజేస్తానని, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామ్ని అవుతానని ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో ఏవో ఎస్ హనుమంతు, పద్మ ,ఎం.వి.ఐ కృష్ణ వేణి వానదారులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్ నీ విమర్శించే హక్కు బీజేపీ నాయకులకు లేదు

- కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి

పద్మక్రాంతి, ఆగస్టు 13, (కల్వకుర్తి ప్రతినిధి):

కల్వకుర్తి బిజెపి పార్టీ నాయకులు కొంతమంది పనిగట్టుకుని కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక విమర్శలు చేయడాన్ని ఖండించిన కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ పైన విమర్శలు చేశారు. దీనిని ఖండిస్తూ బుధవారం కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.బిజెపి నాయకులు ఎన్నడు ప్రజా సమస్యలపై పోరాడిన దాఖలాలు లేవు కానీ.ప్రజల కోసం నిరంతరం శ్రమించే బృంగి ఆనంద్ కుమార్ ని విమర్శించే స్థాయి మీకు ఉందా అని ప్రశ్నించారు. బిజెపి పార్టీ నాయకులు చావు బతుకుల మధ్యలో ఉండి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న సమయంలో ఆదుకున్న వారిపైన మీరు మాట్లాడడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. కల్వకుర్తి పట్టణ ప్రజలు గుర్తుపట్టని వ్యక్తి బిజెపి పార్టీలో చైర్మన్ అభ్యర్థిని చెప్పుకోవడం సిగ్గు చేటు అన్నారు. ప్రజల సమస్యలు ఏనాడైనా పట్టించుకున్నావా.వార్డు మెంబర్ కూడా కానీ నువ్వు ఆనంద్ కుమార్ ని విమర్శిస్తారా.వచ్చే ఎన్నికలలో మీరు ఎక్కడ పోటీ చేస్తారో చెప్పాలని.కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేని సమయంలో 7 మంది కౌన్సిలర్లు గెలవడం జరిగిందని.మీకు ఒక సీటు వచ్చిన విషయం గుర్తుంచుకోవాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల ను కేటాయించిన విషయం లో పార్టీలకతీతంగా బిజెపి నాయకులకు కూడా చోటు కల్పించామని అలాంటి వ్యక్తి పైన మీరు మాట్లాడే హక్కు లేదని మరోసారి ఇలాంటివి పునరావృతం అయితే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో.కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి. కాంగ్రెస్ పార్టీ జిల్ల కార్యదర్శి మిరియాల శ్రీనివాస్ రెడ్డి.యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి పుస్తకాల రాహుల్.మార్కెట్ డైరెక్టర్ రమాకాంత్ రెడ్డి.చంద్ర కాంత్ రెడ్డి.వర్కల భాస్కర్ రెడ్డి.మాజీ కౌన్సిలర్లు ఎజాస్.గోరేటి శ్రీనివాసులు.మబ్బు రామ రాజు.చిన్న.రవి.చిత్తారి శ్రీనివాసులు.కాంగ్రెస్ పార్టీ నాయకులు రేష్మ.రెహానా. జమ్ముల శ్రీకాంత్.సంతు యాదవ్.శ్యామ్ సుంధర్ రెడ్డి.సోఫి.ఆరిఫ్.దాస్య నాయక్.తదితరులు ఉన్నారు.

భారీ వర్షాలు కురుస్తున్నందున ట్యాంక్ బండ్, కొత్త చెరువుల పరిశీలన.

- మహబూబ్ నగర్ ఎస్పీ డి. జానకి, ఐపీఎస్.

పద్మక్రాంతి, ఆగస్టు 13, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో/ మిడ్జిల్ :

జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలలో చెరువులు, వాగులు, కాల్వలు పొంగిపొర్లుతున్నందున ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని బుధవారం జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్ స్వయంగా పరిశీలించారు. నీటితో నిండిన మడుగులు, చెరవులు, వాగులు, కాల్వలు దాటేందుకు ప్రయత్నించకూడదని ఆమె తెలిపారు. వర్షాల సమయంలో విద్యుత్ తీగలు తెగిపోవడం,చెట్లు కూలడం,రహదారులు దెబ్బతినే అవకాశాలు ఉన్నందున జాగ్రత్తగా ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100 కు సమాచారం ఇవ్వాలని కోరారు.ఈ పరిశీలనలో వన్ టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య, టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఇజాజ్ ఉద్దీన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సామూహిక ప్రతిజ్ఞ కార్యక్రమాలు.

నాశ ముక్త్ భారత్ అభియాన్ 5వ వార్షికోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా మాదక ద్రవ్యాల వినియోగం నిర్మూలనకు సామూహిక ప్రతిజ్ఞ కార్యక్రమాలు చేశారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్ మహబూబ్ నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, ధర్మాపూర్ విద్యార్థులు, సిబ్బందితో కలిసి మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. యువతను మాదక ద్రవ్యాల నుండి దూరంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.ఈకార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, సిబ్బంది, సురక్ష పోలీసు కళాబృందం, షీటీం, మానవ అక్రమ రవాణా నిరోధక బృందాల సభ్యులు పాల్గొన్నారు.

తుడుందేబ్బ నూతన డివిజన్ అధ్యక్షునిగా కోట్నక రాంషావ్.

నియామక పత్రాన్ని అందించిన జిల్లా అధ్యక్షులు కోవ విజయ్ కుమార్.

కొమరం భీమ్ ఆసిఫాబాద్, ఆగస్టు 13,(పద్మక్రాంతి ప్రతినిధి):

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్ డివిజన్ నూతన అధ్యక్షులుగా కొట్నక రాంషావ్ ను నియమించినట్లు జిల్లా అధ్యక్షులు కోవ విజయ్ కుమార్ తెలిపారు. బుధవారం తుడుందేబ్బ జిల్లా కార్యాలయంలో ఆయనకు నియామక పత్రాన్ని అందించి, తుడుందేబ్బ నియమ నిబంధనలకు లోబడి ఆదివాసి హక్కుల సాధన కోసం ఉద్యమాన్ని నీతి నిజాయితీగా చేయాలని తనకి ఇచ్చిన పదవి ని బాధ్యతగ సమర్థంగా నిర్వర్తించాలని ఆయనకు నియామక పత్రాన్ని అందించి శుభాకంక్షలు తెలియజేశారు. ఈ సంధర్భంగా నూతన డివిజన్ అధ్యక్షులు గ ఎన్నికైన కోట్నక రాంషావ్ మట్లాడుతూ తనను నమ్మి జాతి బాధ్యతలను అప్పగించినదుకు రాష్ట్ర జిల్లా కమిటీకి దన్యవాదాలు తెలిపి, తనకు ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని జాతి బాగు కోసం ఉద్యమంలో నా వంతు కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో వీరితో పాటు తుడుందేబ్బ జిల్లా సలహదారు జిల్లా అధ్యక్షులు డాక్టర్ కనక ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెందోర్ మారుతీ, జిల్లా ఉపాధ్యక్షులు వెడ్మ భగవంత్ రావు, తీర్యాణి మండల అధ్యక్షులు తొడసం భాస్కర్ , వాంకిడి మండల ప్రధాన కార్యదర్శి పంద్రం సురేష్, కెరమెరి మండల ప్రధాన కార్యదర్శి ఆత్రం భీంరావ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే మా ప్రభుత్వ సంకల్పం.

- జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి.

పద్మక్రాంతి, ఆగస్టు 13, మిడ్జిల్ :



రాష్ట్రంలోని పేద ప్రజల సంక్షేమమే మా ప్రభుత్వ సంకల్పమని జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి స్పష్టం చేశారు. మిడ్జిల్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన రేషన్ కార్డు పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్ పేదల సంక్షేమమే ప్రథమ కర్తవ్యమన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేస్తున్నామన్నారు. రేషన్ కార్డు కుటుంబానికి భరోసా అని తెలిపారు, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అర్హులందరికీ న్యాయం జరుగుతోందని తెలిపారు. మా పాలనలో ఎవరూ ఆకలితో ఉండరని, ప్రతి అర్హుడికి సకాలంలో ప్రభుత్వం అందించే లబ్ధి చేరుస్తాం" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. మిడ్జిల్ మండలానికి 440 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడం, 2343 పాత రేషన్ కార్డుల్లో ఆడిషన్స్ పూర్తయ్యాయని వివరించారు. అభివృద్ధి అంశాలను ప్రస్తావిస్తూ, మిడ్జిల్ నుంచి కొత్తపల్లి వరకు డబుల్ రోడ్డు మంజూరై పనులు జరుగుతున్నాయని అన్నారు. వాడియాల, వేముల, మసిగుండ్లపల్లి, చేన్నంపల్లి వరకు డబుల్ రోడ్డు, రాణిపేట, సింగందొడ్డి వరకు డబుల్ రోడ్లను నూతనంగా మంజూరు చేయించామని చెప్పారు.

జడ్చర్ల నియోజకవర్గానికి దాదాపు 22 కొత్త 33/11 కేవీ సబ్ స్టేషన్లు మంజూరయ్యాయని తెలిపారు. కొల్లాపూర్ సభ అనంతరం సీఎం మిడ్జిల్ మండలంలోని ప్రతి గ్రామానికి కావలసిన అభివృద్ధి పనులపై ప్రైవేట్ సర్వే చేయించాలని ఆదేశించారని గుర్తుచేశారు. డిసెంబర్ 9న ఉదండాపూర్ నిర్వాసితులకు ఆర్ ఆర్ ప్యాకేజీ పూర్తి అయిన తర్వాత, మిడ్జిల్ మండల అభివృద్ధికి పెద్దఎత్తున నిధులు తీసుకొస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో బాదేపల్లి చైర్‌పర్సన్ తంగేళ్ల జ్యోతి , టిపిసిసి కార్యదర్శి గౌస్ రబ్బాని, మిడ్జిల్ మాజీ సర్పంచ్ శారద వెంకటయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

దొంగ మాటలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్.

పద్మక్రాంతి, ఆగస్టు 13, (కల్వకుర్తి ప్రతినిధి:

బిజెపి నేత ఆచారి కల్వకుర్తి ఎమ్మెల్యే పై ఫైర్...

కల్వకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణ రెడ్డి మీరు గతంలో బి ఆర్ ఎస్ లో ఎమ్మెల్సీగా ఉండి ఈ కల్వకుర్తి నియోజక వర్గానికి ఏం చేశారో కల్వకుర్తి నియోజక వర్గ ప్రజలకు శ్వేత పత్రం విడుదల చేయాలి.

అప్పుడున్న కాంగ్రెస్ పార్టీ పీసీసీ అధ్యక్షుడు.ఇప్పుడున్న ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి.మీరు కాంగ్రెస్ అభ్యర్థిగా ఉండి ఎన్నికల సమయంలో కల్వకుర్తి నియోజక వర్గం ప్రజలకు మేనిఫెస్టో లో పొందుపరిచిన విషయాలనే కదా మేము అడిగింది. కొత్తగా ఏం అడుగలేదు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో 6 గ్యారంటీలు 420 హామీలు ఇచ్చి 20 నెలలు గడిచినా ఇప్పటివరకు ఎందుకు అమలు చేయలేదని అడిగాము. భారతీయ జనతా పార్టీ ప్రజల పక్షాన నిలబడి బహిరంగంగానే అడిగాము. తప్పితే ఇంకేదో కొత్తగా అడగలేదు. అడగాల్సిన భాధ్యత ప్రతిపక్షంగా మా మీద భాధ్యత ఉంది. ప్రతి మండలంలో బిజెపి ఆద్వర్యంలో ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశాం.

రోడ్లు అనేక గ్రామాల్లో లేక.ఉన్న సింగిల్ రోడ్లు గుంతలు పడి పాడైపోతే ఏ ఒక్క రోడ్డైన సాంక్షన్ చేపించారా అని నిలదీశారు.

అసలు మీకు రోడ్ల గురించి అవగాహన ఉందా అంటూ ఎద్దేవా చేశారు.

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక

యువత మత్తు పదార్థాలకు

దూరంగా ఉండాలి...

పాపన్నపేట. ఆగస్టు. 13 (పద్మక్రాంతి)

యువత మత్తు పదార్థాల జోలికి వెళ్లి తమ జీవితాలు నాశనం చేసుకోవద్దని ఎస్సై శ్రీనివాస్ గౌడ్ అన్నారు.నశాముక్తలో భాగంగా జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు బుధవారం మత్తుపదార్థాల నిర్మూలనపై పాపన్నపేట జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ...విద్యార్థులు చెడు వ్యవసనాల వైపు వెళ్లొద్దన్నారు.డ్రగ్స్ బారిన పడకుండా ఉండటానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.మంచి అలవాట్లతో జీవిత లక్ష్యాలను సాధించాలని సూచించారు.ఎక్కడైనా డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు కనిపిస్తే తక్షణం పోలీసులకు సమాచారం అందించాలన్నారు.సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.ప్రిన్సిపాల్ నర్సింలు, అధ్యాపకులు సంతోష్, పోలీసు సిబ్బంది బస్వరాజు, ప్రవీణ్, తదితరులున్నారు.

పాపన్నపేట ఉన్నత పాఠశాలలో ఘనంగా టిఎల్ఎం మేళా

పాపన్నపేట ,ఆగస్టు 13 (పద్మక్రాంతి)

మండల కేంద్రమైన పాపన్నపేట ఉన్నత పాఠశాలలో బుధవారం టిఎల్ఎం మేళా ఘనంగా ప్రారంభమైంది.ఈ కార్యక్రమాన్ని మండల విద్యాధికారి ప్రతాపరెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా మండల పరిధిలోని 50 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల నుండి సుమారు 128 ఎగ్జిబిట్లు తెచ్చారు.ఇందులో ఎంపికైన వాటిని మెదక్ జిల్లాస్థాయి ఎగ్జిబిట్ల ఎంపిక కార్యక్రమానికి తీసుకెళ్తామని ఎంఈఓ తెలిపారు.ఈ కార్యక్రమంలో పాపన్నపేట, కుర్తివాడ, కొత్తపల్లి, కాంప్లెక్స్ హెచ్ఎంలు మహేశ్వర్, శ్రీనివాసరావు, రామ్ కిషన్ ,మహేశ్వరి, దత్తురెడ్డి, వివిధ కమిటీల ఉపాధ్యాయులు పంతులు రాజు,బాలరాజు,మంగ నర్సింలు,తదితరులు పాల్గొన్నారు.

పెద్దగుట్ట రంగనాయక స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు.



పద్మక్రాంతి, ఆగస్టు 13, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో/ మిడ్జిల్:

శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని పెద్దగుట్ట రంగనాయక స్వామి దేవాలయంలో ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించబడుతున్నాయి. వార్షిక జాతర కార్యక్రమాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, హారతులు, అన్నదాన కార్యక్రమాలు ఆలయ ప్రాంగణంలో కొనసాగుతున్నాయి. ఈ పూజల్లో బీజేపీ నాయకులు భాండారి శాంతికుమార్, అయ్యగారి ప్రభాకర్ రెడ్డి, జక్క రఘునందన్, నడిమంటి శ్రీనివాస్, జిట్టా వెంకటేష్, సామల నాగరాజు, కందుర్ రమేష్, పిల్లి సూర్యనారాయణ, శ్రీనివాస్ గౌడ్, తిరుపతి, కరాటే రవి, జగదీశ్, రవి ముదిరాజ్, ప్రశాంత్ రెడ్డి, డోజర్ శివ, సుధీర్ రెడ్డి, బిజ్జులా అవినాష్ లు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

భారీ వర్షాలకు నీట మునిగిన పత్తి

రెబ్బెన, ఆగస్టు13, (పద్మక్రాంతి):

కొమురం భీమ్ జిల్లా రెబ్బెన మండలం దుర్గాపూర్ కి చెందిన మడవి లచ్చు పటేల్ తన కున్న 5 ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నాడు. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు 3 ఎకరాలు పూర్తిగా మునిగి పోయింది అని తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని లచ్చు పటేల్ అన్నారు. మునిగి పోవటానికి కారణం నీళ్లు పోవడానికి గతంలో డ్రైనేజీ ఉండేది అన్నారు. కొత్త గా నిర్మిచిన రోడ్డు పనుల అప్పుడు కాంట్రాక్టు డ్రైనేజీ పూర్తిగా మూసి వేశాడు అని అన్నారు. దానిని మరమ్మతులు చేపివలని కోరారు.

గొల్ల శివకుమార్ కుటుంబానికి

అండగా ఉంటాం

- షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి
- తండ్రి గొల్ల బుచ్చయ్యకు పదివేల ఆర్థిక సాయం

షాద్ నగర్, 13 ఆగస్ట్ (పద్మక్రాంతి ప్రతినిధి):

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మొగిలిగిద్ద గ్రామానికి చెందిన గొల్ల శివకుమార్ కుటుంబానికి అంతక్రియల ఖర్చులకోసం పదివేల రూపాయలను షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాపరెడ్డి అందజేశారు. రోడ్డు ప్రమాదంలో మరణించిన గొల్ల శివకుమార్ మృతి పట్ల సానుభూతి వ్యక్తం చేస్తూ నిన్న అతని పార్వతీహానికి నివాళులు అర్పించారు. ఈరోజు జరిగిన అంత్యక్రియల సందర్భంగా అతని తండ్రికి 10,000 గ్రామస్తుల ద్వారా సాయం అందజేశారు. శివకుమార్ కుటుంబానికి తమ వంతు సహకారం అండ ఎల్లవేళలా ఉంటుందని ప్రతాపరెడ్డి తెలిపారు. తండ్రి గోళ్లబుచ్చయ్యకు డబ్బులు అందజేసిన వారిలో గ్రామ పెద్దలు మాజీ ఎంపీటీసీ కోట్ల శ్రీశైలం, కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటేష్ గుప్, పాషాభాయ్, అజ్జు, ర్యాకల వెంకటేష్, మల్లేష్ తదితరులు ఉన్నారు.

మిడ్జిల్ లో ఘనంగా హర్ ఘర్ తిరంగ్" ర్యాలీ

పద్మక్రాంతి, మిడ్జిల్ :

మిడ్జిల్ మండల కేంద్రంలో యువమోర్చా మండల అధ్యక్షుడు పిట్టల ఆంజనేయులు ఆధ్వర్యంలో హార్ ఘర్ తిరంగ్ ర్యాలీకి బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి హాజరై మాట్లాడారు. ఆజాదీ కా అమృత్ మహొూత్సవంలో భాగంగా ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగురవేయాలని కోరారు. మన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు ప్రతీక అన్నారు. యువతీ యువకులు,మహిళలు దేశభక్తి భావంతో భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పల్లె తిరుపతి, ఎన్. రాజేశ్వర్, నరేష్ నాయక్, లక్ష్మారెడ్డి, కావలి నరేందర్, మావిళ్ళ వెంకటయ్య, వెంకటరెడ్డి, వాసుదేవ్, నరేష్, శేఖర్,శేఖర్ రెడ్డి, దేవేందర్, రామకృష్ణ, నవీన్, బండారి శివ, శివశంకర్, మల్లేష్, హరీష్, అరవింద్, యాదయ్య, కిట్టు, మహేష్, వెంకటేష్, భరత్ , భాను, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

కురుస్తున్న వర్షాలకు అధికారులు

అప్రమత్తంగా ఉండాలి.

సమీక్ష సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి.

మహేశ్వరం ఆగస్టు 13, (పద్మక్రాంతి ప్రతినిధి):

కురుస్తున్న వర్షాలకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని జల్పల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో వర్షాల ప్రభావం, సమస్యల పరిష్కారంపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. అధికారులు వార్డు వారీగా వర్షం ప్రభావిత ప్రాంతాల పరిస్థితులను సమీక్షించాలని తెలిపారు. ముఖ్యంగా ఉస్మాన్ నగర్, నబీల్ కాలనీ, శ్రీరామ్ కాలనీ వంటి చెరువుల పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏ సమస్య వచ్చినా వెంటనే అధికారులకు దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. మున్సిపల్ సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని, విపత్కర పరిస్థితుల్లో ఒకరికి ఒకరు తోడుగా ఉండాలని ఆమె ఆదేశించారు. సానిటేషన్ సిబ్బంది, వార్డు అధికారులు ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజల కోసం అత్యవసర పరిస్థితుల్లో అమలు చేసే ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈసమావేశంలో కమిషనర్ బి. వెంకట్రావు, డీఈ, మాజీ చైర్మన్ అహ్మద్ సాది, మాజీ వైస్ చైర్మన్ యూసఫ్ పటేల్, అలాగే ఎంఐఎం, టిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి మాజీ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

గిరిజన తండాల అభ్యర్థులకు అవగాహన సదస్సు..

షాద్ నగర్, 13 ఆగస్టు (పద్మక్రాంతి ప్రతినిధి):

ప్రభుత్వ పథకాలపై చైతన్యం గిరిజనుల ఉపాధి కోసం ప్రభుత్వాలు ఏర్పాటు చేస్తున్న పథకాలను ఉపయోగించుకునే దిశగా ప్రతి ఒక్కరిలో చైతన్యం అవసరమని ఆదివాసి కాంగ్రెస్ నేత శీను నాయక్ అన్నారు. పట్టణంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి ఎంపిక చేయబడిన గిరిజన తండాల అభ్యర్థులకు డీఏజెవిఏ కేంద్ర ప్రభుత్వ పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యకార అధికారులు శైలిమ, యేసుదాసు పాల్గొని పథకాలపై అవగాహన కల్పించారు. 90 శాతం ప్రభుత్వ సబ్సిడీ పై ఫిషరీస్ యాక్టివిటీస్ లో ఉన్న అభ్యర్థులకు 16 రకాల కాంపోనెంట్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. 10 శాతం లబ్దిదారుని వాటాకి పీఎంఎంఎస్ వై పథకానికి అనుసంధానం చేయబడుతుందని వివరించారు. ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అన్ని మండలాల నుంచి ఎంపికైన అభ్యర్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉర్కొండలో హార్ ఘర్ తిరంగా ర్యాలీ.

ఉర్కొండ, ఆగస్టు 13 పద్మక్రాంతి:

ఉర్కొండ మండలంలోనీ ఇందిరాక్రాంతి పథం ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా, హర్ ఘర్ స్వచ్ఛతా ర్యాలీ నిర్వహించారు. ఉల్లాస్ యాప్ లో నిరక్ష్యరాస్యులను గుర్తించి నమోదు చేయుట, కార్యక్రమాలను విజయవంతం చేయుటకు తీసుకోవలసిన ఆవశ్యకతపై మహిళా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, బుక్ కీపర్స్, సిసిలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణయ్య, ఏపీయం జంగయ్య, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శ్యామల, ఎంపీఓ లక్ష్మణ్, సీసీలు సునీల్ రెడ్డి, ప్రభాకర్ ఉన్నారు.

తక్షణ స్పందనతో ప్రాణాన్ని రక్షించిన ఎస్పీకి అభినందనలు

పద్మక్రాంతి, ఆగస్టు 13, ఉమ్మడి మహబూబ్ న గర్ జిల్లా బ్యూరో/ మిడ్జిల్ :

మహబూబ్ నగర్ పట్టణంలోని పాత బస్ స్టాండ్ సమీపంలో కిద్వాయిపేట వైపు వెళ్లే దారిలోని పెద్ద కాలువలో యెల్లమ్మ వృద్ధు రాలు, భర్త రాందాస్, నివాసం: పాతతోట, మోండిగేరి, అకస్మాత్తుగా పడిపోయింది. డయల్ 100 కి కాల్ రాగా వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య, ఫైర్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి ఆమెను సురక్షితంగా బయటకు తీశారు. అనంతరం చికిత్స నిమిత్తం మహబూబ్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈసందర్భంలో మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్, వన్ టౌన్ పోలీస్ ఇన్స్పెక్టర్ అప్పయ్య, ఫైర్ అధికారుల వేగవంతమైన స్పందించడంతో, మానవతా ధర్మం, సేవా భావాన్ని ప్రశంసిస్తూ అభినందనలు తెలిపారు.

మాదకద్రవ్యాల నియంత్రణ అందరి బాధ్యత.

మిడ్జిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన.

పద్మక్రాంతి, ఆగస్టు 13, మిడ్జిల్ ప్రతినిధి:

మిడ్జిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సామాజిక న్యాయం, సాధికారత శాఖ ఆదేశాల మేరకు నాశ ముక్త భారత్ అభియాన్ లో భాగంగా మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ విద్యార్థులచే చేయించారు. ఈ సందర్భంగా మిడ్జిల్ ఎస్సై శివ నాగేశ్వర్ నాయుడు మాట్లాడుతూ... మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, యువత గంజాయి డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణ సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యతని సూచించారు. డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు అక్రమ రవాణా చేసే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండి వారి సమాచారాన్ని సంబంధిత శాఖ అధికారులకు తెలియజేయాలని అన్నారు. డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పములో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానాచార్యులు పి.తిరుపతయ్య, విద్యార్థుల కౌన్సిలర్ క్రాంజి రావు, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది,విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక

తుమ్మలూరులో భారీ వర్షాలకు షార్ట్ సర్క్యూట్.

కాలి బూడిదైన ఇంట్లోని విలువైన వస్తువులు.

మహేశ్వరం ఆగస్టు 13,(పద్మక్రాంతి ప్రతినిధి):

గత కొన్ని రోజులుగా భారీగా కురుస్తున్న వర్షాలకి తుమ్మలూర్ గ్రామంలో అక్కేరి. రమాదేవి ఇంట్లో షార్ట్ సర్క్యూట్ వల్ల విలువైన వస్తువులు కాలిపోయి తీవ్రంగా నష్టపోయారు. దీంతో ఇంట్లోని అన్ని ఎలక్ట్రిక్ వస్తువులు, టీవీ, ఫ్రిడ్జ్ ఇతర ఎలక్ట్రిక్ వస్తువులతో పాటు ప్రతిరోజు ఇంట్లో ఉపయోగించే వస్తువులు కాలి బూడిద అయ్యాయి. అదృష్టవశాత్తు మంగళవారం సాయంత్రం ఘటన జరిగిన సమయంలో ఇంట్లో ఎవ్వరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పి, ఎలాంటి ప్రాణానష్టం జరగలేదు. ఆమె రోజు కూలీ పని చేసుకుని జీవనం సాగిస్తుంది. ఆమె ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. గృహిణి జన్మత మూగ అవ్వడం, భర్త లేకపోవడంతో పేదరికంతో మగ్గుతున్న ఆమెకు ఈ విధంగా నష్టం వాటిల్లిందని స్థానికులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ప్రభుత్వ అధికారులు, విద్యుత్ అధికారులు స్పందించాలని, ప్రభుత్వం నుంచి సహాయం అందించాలని కోరారు. దాతలు సహాయం కోసం ముందుకురావాలని వేడుకుంటున్నారు.

మందుముల సాయిలు పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు.

- ఆరోపించిన మహేశ్వరం,ఇబ్రాహింపట్నం నియోజకవర్గాల్లోని క్రిస్టియన్ బాధితులు.

మహేశ్వరం, ఆగస్టు 13 (పద్మక్రాంతి ప్రతినిధి)



పాస్టర్, రియల్ ఎస్టేట్ చేస్తున్న మందుముల సాయిలు క్రిస్టియన్లను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మహేశ్వరం, ఇబ్రాహీంపట్నం నియోజకవర్గాల్లోని తుక్కుగూడ యాచారం, యంజాల్, మాకాల్, బండ్లగూడ, బడంగ్ పేట, మహేశ్వరం మండలాలకు చెందిన గ్రామీణ పేద చర్చి పాస్టర్లు కొందరు ఆరోపించారు. మందుముల సాయిలుపై పోలీసు ఉన్నతాధికారులకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశామని తెలిపారు. ఇతని ద్వారా ఎదుర్కొంటున్న బాధలు, కష్టనష్టాలు ముఖ్యమైన సమస్య ఆర్థిక వేధింపులు కారణంగా ప్రమాదకర పరిస్థితులలో తీవ్ర ఇబ్బందులు భరిస్తున్నామన్నారు. మంఖాల్ లో ఉన్న క్రైస్తవ సమాధుల స్థలాన్ని వ్యక్తిగతంగా వాడుకుంటూ దుర్వినియోగం చేస్తున్నాడని ఆరోపించారు. బిఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా ఉంటూ మమ్మల్ని రాజకీయంగా బెదిరింపులకు పాల్పడుతున్నాడని అన్నారు. రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం నియోజకవర్గంలోని పాస్టర్ ఫెలోషిప్ లకు తానే పెద్ద అని ఆధిపత్యం చెలాయిస్తున్నాడన్నారు. రియల్టర్ మందుముల సాయిలు అలియాస్ సాయిలన్న అనే భూకబ్జాదారుడు, మాజీ నక్సలైట్ అని చెప్పుకుంటూ, ఈ మధ్య క్రిస్టియన్ పాస్టర్లు కొందరిని డబ్బుల వలవేసి ప్రలోభాలకు గురి చేశాడని వారు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై

రాచకొండ కమిషరరేట్ పరిధిలోని ఇబ్రహీం పట్నం, మహేశ్వరం, వనస్థలిపురం ఎసిపిల పరిధిలో పలు పోలీస్ స్టేషన్లలో మందుల సాయిలు బాధితులకు పూర్తిగా న్యాయం చేయాలని కోరామని చెప్పారు.

గురుకులాలపై ఇంత దిగజారుడు విమర్శలా

- 600 కోట్ల గుడ్ల అవినీతిపై ఆధారాలు చూపగలరా
- టెండర్ ప్రక్రియపూర్తి కాకుండానే మాట్లాడితే ఎలా
- ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వ్యాఖ్యలపై మండిపడ్డ అడ్లూరి

జగిత్యాల,ఆగస్ట్13(పద్మక్రాంతి):

గురుకులాలకు కోడిగుడ్ల సరఫరా చేసేందుకు జరిగిన టెండర్లలో రూ.600 కోట్ల అవినీతి జరిగిందంటూ బిఆర్ఎస్ నేత ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మండిపడ్డారు. జగిత్యాల మెడికల్ కళాశాల అతిథి గృహంలో బుధవారం ఏర్పాటు- చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి అడ్లూరి మాట్లాడుతూ..కోడిగుడ్ల సరఫరాకు సంబంధించి టెండర్ పక్రియ జరుగుతోందని, టెండర్ పక్రియలో ఉండగా రూ.600 కోట్ల అవినీతి ఎలా జరిగిందో స్పష్టం చేయాలని నిలదీశారు. ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. తెలిసీ తెలియక మాట్లాడితే సహించేది లేదన్నారు. గురుకులాల కార్యదర్శిగా పనిచేసిన ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ తన పదవికి రాజీనామా చేసి బిఎస్‌పి నేతగా గురుకులాల విషయంలో, పరిపాలనలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌పై ఎన్ని విమర్శలు చేశారో గుర్తుచేసుకోవాలని హితవు పలికారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ఏ ఒక్కరోజైనా కెసిఆర్, మంత్రులు గురుకులాలకు వెళ్లి విద్యార్థుల కష్ట సుఖాలను తెలుసుకునే ప్రయత్నం చేశారా, వారితో కలిసి ఏనాడైనా భోజనం చేశారా అని నిలదీశారు. గురుకులాల్లో తరచూ ఫుడ్ పాయిజన్ ఎందుకు అవుతుందనే విషయంపై లోతుగా విచారణ చేపట్టి అల్యూమినియం పాత్రల వల్లే జరుగుతుందని గుర్తించామని అన్నారు. వాటి స్థానంలో రూ.7 కోట్లు- వెచ్చించి స్టీల్ వంట పాత్రలను అందించామని అన్నారు. గురుకులాలకు గత ప్రభుత్వం బకాయి పడ్డ రూ.400 కోట్లు- తమ ప్రభుత్వం చెల్లించిందని అన్నారు. బకాయి లేనివి లేకుండా చేసేందుకు ప్రతి మూడు నెలలకు ఒకసారి గురుకులాల బకాయిలు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు- వివరించారు. జిఓ 17 గురించి పూర్తి అవగాహన లేని ప్రవీణ్‌కుమార్ అవినీతి జరిగిందంటూ మాట్లాడటం చూస్తే ఆశ్చర్యం వేస్తోందని అన్నారు. ఆయనతో మాట్లాడించిన వారు కూడా వాస్తవాలు తెలుసుకోవాలని చురకలంటించారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి,మైనారిటీ- విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యనందించాలనే గొప్ప సంకల్పంతో తమ ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి యంగ్ ఇంటిగ్రేటేడ్ స్కూల్‌ను మంజూరు చేసిందని అన్నారు. రూ.200 కోట్లతో 25 ఎకరాల స్థలంలో అన్ని హంగులతో కూడిన భవనాన్ని నిర్మించేందుకు -టె-ండర్ పక్రియ చేపడుతున్నట్లు- తెలిపారు. తమది సంక్షేమ ప్రభుత్వమని, సంక్షేమ శాఖ మంత్రిగా గురుకులాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు- పేర్కొన్నారు. ఈ సమావేశంలో జగిత్యాల ఎంఎల్ఎ డాక్టర్ సంజయ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు గాజెంగి నందయ్య, ఒరుగల శ్రీనివాస్, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు

గణేశ్ మండపాలన్నీ జియో ట్యాగ్

హైదరాబాద్,ఆగస్ట్13(పద్మక్రాంతి):

గణేశ్ నవరాత్రుల సందర్భంగా సెక్టార్ ఎస్ఐలు తమ పరిధిలో ఏర్పాటు- చేసిన మండపాల పూర్తి వివరాలు సేకరించి జియో ట్యాగింగ్ చేయాలని నగర సీపీ సీవీ ఆనంద్సూచించారు. మండపాల ఏర్పాటు- నుంచి నిమజ్జనం వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బందోబస్తు ఏర్పాట్లపై అధికారులతో ఆయన సన్నాహక సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ఇన్‌స్పెక్టర్‌లు మండపాల నిర్వాహకులతో తరచూ సమావేశాలు నిర్వహించి వారికి కావాల్సిన ఏర్పాట్లు- చేయాలని సూచించారు.

కంచగచ్చిబౌలి భూముల్లో పర్యావరణం పునరుద్దరణ

తెలంగాణ ప్రభుత్వం చర్యలకు సుప్రీం అభినందన

న్యూఢిల్లీ,ఆగస్ట్13(పద్మక్రాంతి):

కంచ గచ్చిబౌలి భూముల వ్యవం-ారంపై బుధవారం సుప్రీంకోర్టులో మరోమారు విచారణ జరిగింది. కంచ గచ్చిబౌలి భూముల్లో పర్యావరణ పునరుద్దరణ చర్యలు చేపడుతున్నామని కోర్టుకు తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. సమగ్ర ప్రణాళికను సమర్పించేందుకు ఆరు వారాలు గడువు కోరింది ప్రభుత్వం. తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది సీజేఐ జస్టిస్ బీ.ఆర్ గవాయి ధర్మాసనం. అభివృద్ధికి తాము అడ్డుకాదని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. సుస్థిర అభివృద్ధి ముఖ్యమని సీజేఐ ధర్మాసనం పేర్కొంది. అభివృద్ధి చేసేటప్పుడు పర్యావరణ పరిరక్షణను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ సూచించారు. కంచ గచ్చిబౌలి భూముల్లో ప్రభుత్వ పర్యావరణ పరిరక్షణ చర్యలు మంచి ఫలితాలు ఇస్తే తప్పకుండా మెచ్చుకుంటామని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. గతంలో చేసిన వ్యాఖ్యలను కూడా ఉపసంహరించుకొని మరింతగా ప్రశంసిస్తామని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు.

ఖమ్మం జిల్లాలో జోరు వర్షాలు

- ఆకేరు వాగులోని చెక్‌డ్యాం మీదుగా వరద నీరు
- గతేడాది వరదలు తలచుకుని ముందస్తు చర్యలు



ఖమ్మం,ఆగస్ట్13(పద్మక్రాంతి):

జిల్లాలో రెండు రోజులుగా జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. భారీగా వరద రావటంతో పాలేరు జలాశయం మత్తడి దుంకి ప్రవహించింది. సాయంత్రం 18,500 క్యూసెక్కులకు వరద ఉద్ధృతి పెరగటంతో అలుగు ఉప్పొంగుతోంది. ఆ స్థాయి వర్షాలు మున్నేరు ఎగువన కురిసి ఉంటే ఇప్పటికే వాగు ఉగ్రరూపం దాల్చేదే. ఆకేరు వాగులోని చెక్‌డ్యాం మీదుగా వరద నీరు పారుతోంది. పరిసరాల్లోని చెరువులు నిండటానికి సిద్ధంగా ఉన్నాయి. ఎగువ నుంచి వరద వస్తుండటంతో మున్నేరులో ప్రస్తుతం పది అడుగుల వద్ద నీరుంది. ఆకేరు పరిసరాల్లో వర్షం కురిస్తే రాత్రి వరకు 14అడుగులకు చేరుకుంటుందని నీటిపా-రుదలశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. మున్నేరు వరద విలయంతో గతేడాది సెప్టెంబరు 1న ఖమ్మం జిల్లాకేంద్రం అతలాకుతలమైంది. పరీవాహక కాలనీల్లోని ఇళ్లు నీట మునగటంతో జరిగిన నష్టం నుంచి పేదలు ఇంకా కోలుకోలేదు. నాటి విషాద దృశ్యాలను తలచుకుంటే ఒళ్లు జలదరిస్తుందని, భారీ వర్షాలు కురవనున్నాయని తెలిస్తే వణుకు పుడుతోందని బాధితులు ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాలు కురవనున్నాయని వాతావరణశాఖ హెచ్చరించటంతో అప్రమత్తమయ్యారు. గతంలో మున్నేరుకు వచ్చే వరదను అంచనా వేయకపోవటంతోనే రాత్రికిరాత్రే ఉపద్రవం ఎదురైంది. ఈసారైనా అధికారులు అప్రమత్తంగా ఉంటూ.. ఆకేరు వాగు, ఎగువనున్న చెరువులను ఎప్పటికప్పుడు పరిశీలించి వరద రాకను పసిగట్టి ప్రజలకు సూచనలిస్తేనే ముప్పు తప్పుతుంది. ఈనెల 14నుంచి 17వరకు భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ హెచ్చరించింది. అధికారులకు సెలవులు రద్దు చేస్తున్నామని కలెక్టర్ అనుదీప్‌ప్రకటించారు. యంత్రాంగం కార్యస్థానంలో ఉండాలన్నారు.

రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆర్టీసీలో రద్దీ

- మొత్తం 3.68 కోట్ల మంది రాకపోకలు
- అందులో 2.51 కోట్ల ఉచిత ప్రయాణాలు
- సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ వెల్లడి

హైదరాబాద్,ఆగస్ట్13(పద్మక్రాంతి):

రాఖీ పౌర్ణమి సందర్భంగా తెలంగాణ ఆర్టీసీ బస్సులను మహిళలు పెద్ద ఎత్తున వినియోగించుకున్నారని.. ఆరు రోజుల్లో మొత్తం 3.68 కోట్ల మంది రాకపోకలు సాగించగా.. అందులో 2.51 కోట్ల ఉచిత ప్రయాణాలు ఉన్నాయని సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. ఈ నెల 9న రాఖీ పండుగ రోజున 45.62 లక్షల మంది మహిళలు ప్రయాణించగా.. ఈ నెల 11న అత్యధికంగా 45.94 లక్షల మంది రాకపోకలు సాగించారని పేర్కొన్నారు. ఒక్కరోజులో ఇంతమంది మహిళలు ప్రయాణించడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. గత ఏడాది రాఖీకి 2.75 కోట్ల ప్రయాణికులను గమ్యస్థానాలకు చేసిందని, ఈ ఏడాది 3.68 కోట్ల మంది రాకపోకలు సాగించారన్నారు. గతేడాదితో పోలిస్తే 92.95 లక్షల మంది ఎక్కువగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారని.. ఈ ఏడాది 2.28 కోట్ల కిలోమీటర్లు ఆర్టీసీ బస్సులు తిరిగాయన్నారు. గత ఏడాదితో పోల్చితే 53 లక్షల కిలో మీటర్లను అదనంగా సంస్థ బస్సులను తిపిందని చెప్పుకొచ్చారు. రాఖీ పౌర్ణమికి మహాలక్ష్మి పథకాన్ని మహిళలు పెద్ద ఎత్తున వినియోగించుకుని ఉచితంగా రాకపోకలు సాగించడంపై రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సైతం హర్షం వ్యక్తం చేశారు. అన్నాచెల్లెల్ల బంధం ఎంత గొప్పదో ఈ రాఖీ గణాంకాలు తెలియజేస్తున్నాయన్నారు. సంస్థ సామర్థ్యాన్ని అంతా ఉపయోగిం చుకుని రాఖీ పండుగకు రికార్డుస్థాయిలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేసిన ఆర్టీసీ అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. రాఖీ పండుగను త్యాగం చేసి, భారీ వర్షాల్లోనూ నిబద్దత, అంకితభావం, క్రమశిక్షణతో పనిచేశారంటూ ప్రశంసించారు. రద్దీలోనూ మహాలక్ష్మి-మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్య పథకాన్ని విజయవంతంగా అమలు చేశారన్నారు. ముందస్తు ప్రణాళికతో పాటు- సిబ్బంది నిబద్ధతతో పనిచేయడం వల్లే రాఖీ పండుగకు లక్షలాది మంది ప్రయాణికులను క్షేమంగా సిబ్బంది గమ్యస్థానాలకు చేర్చారని టీ-జీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ తెలిపారు. ఈ రాఖీ పండుగ ఆపరేషన్స్ సంస్థలో సరికొత్త రికార్డులను నమోదు చేసిందని, ఈ నెల 11న ఒక్క రోజులో అత్యధికంగా 68.45 లక్షల మంది ప్రయాణించారని చెప్పారు. ప్రజారవాణా వ్యవస్థపై ప్రజల ఆదరాభిమానాలు ఎంతలా ఉన్నాయో చెప్పేందుకు ఈ రికార్డులే నిదర్శనమని చెప్పారు. ఆర్టీసీకి సహకరిస్తూ.. ప్రజా రవాణా వ్యవస్తను ఆదరిస్తోన్న, ప్రోత్సహిస్తోన్న ప్రయాణికులందరికీ సజ్జనార్ కృతజ్ఞతలు తెలిపారు.

బెట్టింగ్ యాప్ కేసు

- ఇడి విచారణకు హాజరైన మంచు లక్ష్మి

హైదరాబాద్,ఆగస్ట్13(పద్మక్రాంతి):

బెట్టింగ్ యాప్ ప్రమోషన్ల కేసులో సినీ నటి మంచు లక్ష్మి బుధవారం ఇడి విచారణకు హాజరైయ్యారు. బషీర్‌బాగ్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ప్రాంతీయ కార్యాలయానికి ఉదయం 11 గంటలకు విచారణకు వచ్చిన మంచు లక్ష్మిని అధికారులు స-ుమారు మూడున్నర గంటల పాటు- విచారించారు. విచారణ అనంతరం మంచు లక్ష్మి మీడియాతో మాట్లాడకుండానే వెళ్లిపోయారు. బెట్టింగ్ యాప్ ప్రమోషన్లకు సంబంధించి తీసుకున్న పారితోషకం గురించి ఇడి అధికారుల ఆరా తీసినట్లు- తెలిసింది. ఇడి అధికారులకు మంచు లక్ష్మి తన బ్యాంకు ఖాతాల వివరాలను అందచేసినట్లు- సమాచారం. కాగా, మంచు లక్ష్మి వైఓఎల్ఓ 247 అనే బెట్టింగ్ యాప్‌ను ప్రమోట్ చేశారు. కాగా, బెట్టింగ్ యాప్‌లు ప్రమోట్ చేశారని సినీ నటు-లు, టివీ హోస్ట్‌లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయన్సర్లపై రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో 29 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో మనీ లాండరింగ్ జరిగిందనే కోణంలో ఇడి ఎన్‌ఫోర్స్‌మెంట్ రిపోర్ట్(ఇసిఐఆర్) రిజిస్టర్ చేసింది. ఈ క్రమంలో వరుసగా సినీ నటులను విచారిస్తోంది. ఈ కేసులో ఇడి మరికొంత మందికి నోటీసులు ఇచ్చే అవకాశం ఉన్నట్లు- తెలుస్తోంది.

RNI No : TELTEL/2022/85167
పద్మక్రాంతి
(వాస్తవాలు వెలుగులోకి) తెలుగు దినపత్రిక

కూలీ, వార్-2 లకు పోటీగా ధూమకేతు

బెంబేలెత్తిస్తున్న బెంగాల్ మూవీ

ఆగస్టు 14న గురువారం కూలీ, వార్2 మూవీలు పెద్ద ఎత్తున రిలీజ్ కాబోతున్నాయి. వీటిపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. మకూలీలో సీనియర్ యాక్టర్లు వార్2లో యంగ్ అండ్ డైనమిక్ హీరోలు మీ సినిమానా మా సినిమానా అన్నట్లుగా పోటీ- పడుతున్నారు. ఎవ్వరూ ఎక్కడా తగ్గట్లేదు. ఆడియన్స్‌ని థియేటర్లకు రప్పించేందుకు చేస్తున్న ప్రమోషన్స్ పీక్స్‌కి చేరాయి. ఈ దశలో మరో మూవీ రిలీజ్ అయ్యేందుకు సాహసం చేస్తుందా. కానీ మేం చేస్తాం అంటోంది ఓ బెంగాలీ ఫిల్మ్. వార్2, కూలీ చిత్రాలతో పోటీ పడుతూ 'ధూమకేతు' అనే బెంగాలీ ఫిల్మ్ పశ్చిమ బెంగాల్లో ఆగస్టు 14నే రిలీజ్ అవుతోంది. వార్2, కూలీకి ఈ సినిమాకు ఏంటీ- పొంతన అని తక్కువగా తీసిపారేయొద్దు. ఉత్తరాదిలో వార్2. సౌత్‌లో కూలీ సినిమాలకు ఫుల్ అటెన్షన్ క్రియేట్ అవుతుంది. కానీ బెంగాల్‌లో మాత్రం ధూమకేతుకు విపరీతమైన క్రేజ్ ఏర్పడింది. ఎంతలా అంటే ప్రీ బుకింగ్స్ సేల్స్‌లో ఈ లోకల్ సినిమాను వార్2 కూడా బీట్ చేయలేనంతలా. ధూమకేతు ఇప్పటి వరకు 21 వేల టికెట్లు- అమ్ముడవగా, వార్2కి కేవలం 6 వేల టికెట్లు- మాత్రమే తెగాయన్నది మార్కెట్ వర్గాల టాక్. ఇక కూలీని పెద్దగా పట్టించుకోవడం లేదు బెంగాల్ ఆడియన్స్. ఈరేంజ్ బిజినెస్ ఇప్పటి వరకు ఏ బెంగాలీ సినిమాకి జరగలేదని అంటున్నాయి అక్కడి మార్కెట్ వర్గాలు. అంతేకాదు బెంగాల్ వ్యాప్తంగా తొలి రోజే 400 ప్లస్ షోలు పడనున్నాయట. రన్నింగ్‌లో ఈ సంఖ్య మరింత పెరిగే ఛాన్స్ ఉందట. ఇంతలా హైప్ క్రియేట్ చేస్తున్న ధూమకేతు .. ఈ మధ్యలో తెరకెక్కిన ఫిల్మ్ కూడా కాదు.. ఎప్పుడో పదేళ్ల క్రితం మొదలు పెట్టి.. 8 ఏళ్ల క్రితం పూర్తైన సినిమా. పలుమార్లు రిలీజ్ వాయిదా పడుతూ ఎట్టకేలకు ఇప్పటికీ మోక్షం దక్కించుకుంది. బెంగాల్ సూపర్ స్టార్ దేవ్, శుభశ్రీ గంగూలీ సిక్త్ -టైమ్ జోడీ కడుతుండటంతో బెంగాల్ వ్యాప్తంగా విపరీతమైన హైప్ క్రియేట్ అయింది. ఈ ఇద్దరు గతంలో జూనియర్ ఎన్టీఆర్, సమంత, కాజల్ నటించిన బృందావనం బెంగాల్ రీమేక్ వర్షన్ ఖోకా420 వర్షన్‌లో కలిసి నటించారు. ఈ సినిమా బెంగాల్‌లో బ్లాక్ బస్టర్ సక్సెస్ అందుకుంది. దీంతో ఈ జంటకు హిట్ పెయిర్‌గా క్రేజ్ వచ్చింది. ఈ హిట్‌పెయిర్ ఇప్పుడు ధూమకేతుతో మరోసారి జంటగా రాబోతున్నారు. ఆగస్టు14న రిలీజ్ అవుతోన్న ధూమకేతు ఒకవేళ పాజిటివ్ టాక్ తెచ్చుకుంటే బెంగాల్‌లో వార్2 కలెక్షన్లకు గండిపడినట్లే అవుతుంది.





పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై ముంబై సంస్థ కేసు

రాజసాబ్ విడుదలపై ప్రభావం

టాలీవుడ్ బడా నిర్మాణ సంస్థపై కేసు నమోదయింది. తమను మోసం చేసారని పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై ముంబైకి చెందిన ఐవివై ఎంటర్‌టెన్‌మెంట్స్ కేసు పెట్టింది. వివరాలలోకెళితే పీపుల్స్ మీడియా సంస్థ నిర్మాణంలో రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా రాజాసాబ్ అనే సినిమాను నిర్మిస్తోంది. అత్యంత భారీ బడ్జెట్ పై చాలా కాలంగా ఈ సినిమాను నిర్మిస్తోంది పీపుల్స్ మీడియా. అయితే వందల కోట్ల బడ్జెట్ తో పీపుల్స్ మీడియా నిర్మిస్తున్న ఈ సినిమాకు ముంబై కు చెందిన ఈ సంస్థ ఆర్థిక భాగస్వామిగా వ్యవహరిస్తోంది. సినిమా షూటింగ్ కు అయ్యే ఖర్చు తదితర వాటికి ఆర్థిక వనరులు సమకూర్చేలా ఇరు సంస్థలు ఒప్పందాలు చేసుకున్నాయి. గ్రాండ్‌గా షూటింగ్ స్టార్ట్ చేసిన పీపుల్ మీడియా మేకర్స్ ఈ సినిమా షూటింగ్ ను అనుకున్న టైమ్ లో ఫినిష్ చేయలేక పోయారు. ఇప్పటికే రాజాసాబ్ అనేకసార్లు రిలీజ్ వాయిదా పడుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో పీపుల్ మీడియా తమ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని, సినిమా షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయజేకుండా, తమకు ఎలాంటి సమాచారం అందించడం లేదని, మేము ఇచ్చిన డబ్బులు ఎలా ఉపయోగించారనే దానిపై వివరణ కూడా వివరన ఇవ్వలేదని చెబుతూ ఢిల్లీ కోర్టులో కేసు నమోదు చేసింది. అలాగే మేము ఇచ్చిన డబ్బులో ప్రస్తుతం రూ. 218 కోట్లు- తిరిగి ఇవ్వాలని ఈ సంస్థ డిమాండ్ చేస్తోంది. ఇదిలా ఉండగా ఈ సినిమా ఇంకా నాన్-థియేట్రికల్ డీల్‌ను క్లోజ్ కాలేదని, అనుకొని కారణాల వలన రిలీజ్ వాయిదా వేసామని కావాలని తమ పరువుకు భంగం కలిగింస్తున్నారని ఐవివై సంస్థపై కోర్టును ఆశ్రయించింది పీపుల్స్ మీడియా.

నానితో శేఖర్ కమ్ముల మూవీ

టాలీవుడ్ స్టార్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులకి మంచి వినోదం పంచుతున్న విషయం తెలిసిందే. ఆయన తెరకెక్కించిన ప్రతి చిత్రం కూడా బాక్సాఫీస్ దగ్గర మంచి వసూళ్లే రాబట్టింది. ఇటీ-వల కుబేర అనే చిత్రంతో పలకరించాడు. ఈ మూవీ కూడా మంచి విజయం సాధించింది. ఇక ఇప్పుడు నానితో ఓ ప్రాజెక్ట్ చేయనున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. నేచురల్ స్టార్ నాని తన కెరీర్‌ను వైవిధ్యంగా మలుస్తున్నాడు. ప్రేమకథలతో, కుటుంబ డ్రామాలతో ప్రేక్షకుల మనసు దోచిన నాని, ఇటీవల 'హిట్ 3'లాంటి డార్క్ యాక్షన్ థ్రిల్లర్‌తో వైవిధ్యాన్ని చూపించాడు. ప్రస్తుతం శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో 'ది ప్యారడైజ్' చిత్రం చేస్తున్నాడు. ఈ మూవీ తర్వాత శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ఓ మూవీ చేయనున్నాడనే వార్త ఫిల్మ్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతోంది. ఇటీవలే 'కుబేర' మూవీతో మళ్లీ ఫామ్‌లోకి వచ్చిన శేఖర్ కమ్ముల, నానితో కలిసి ఎలాంటి కథను సినిమాగా తీయబోతున్నారా అనే ఆసక్తి పెరుగుతోంది. వీరిద్దరి కాంబినేషన్‌లో ఇది తొలి సినిమా కావడం, ఇద్దరికీ భిన్నమైన ఫాలోయింగ్ ఉండటంతో ఈ ప్రాజెక్ట్‌పై అప్పుడే హైప్ క్రియేట్ అయింది. ఈ మూవీలో హీరోయిన్‌గా సాయిపల్లవి పేరు వినిపిస్తుంది. ఇది నిజమైతే, ఇది నాని - సాయిపల్లవి జోడీకి మూడో సినిమా అవుతుంది. గతంలో వీరిద్దరూ కలిసి నటించిన 'ఎంసీఏ' (2017), 'శ్యామ్ సింగరాయ్' (2021) మంచి విజయం సాధించాయి. ప్రేక్షకుల నుంచి హిట్ పెయిర్‌గా గుర్తింపు కూడా పొందారు. శేఖర్ కమ్ములకు సాయిపల్లవి ఫేవరెట్ హీరోయిన్. ఇద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'ఫిదా' ఆమెకు స్టార్‌డమ్ తీసుకొచ్చింది. ఆ తర్వాత 'లవ్‌స్టోరీ' కూడా మంచి స్పందన తెచ్చుకుంది. తెలంగాణ యాసలో సాయిపల్లవి చెప్పిన డైలాగులు ఇప్పటికీ ప్రేక్షకులను ఆకట్టు-కుంటు-న్నాయి. ఇప్పుడు అదే దర్శకుడు, అదే హీరోయిన్, కొత్తగా నానితో జత కట్టడం విశేషం.

సాయిపల్లవి ఇటీవలే నాగచైతన్యతో నటించిన 'తండేల్' సినిమాతో బ్లాక్‌బస్టర్ అందుకుంది. ఇప్పుడు బాలీవుడ్‌లో రూపొందుతున్న భారీ మైథాలజికల్ మూవీ 'రామాయణ' లో సీత పాత్రలో నటిస్తోంది. ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ రాముడిగా, యష్ రావణుడిగా నటించగా, 2026 లేదా 2027 దీపావళికి రిలీజ్ చేయాలని మేకర్స్ లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే నాని - శేఖర్ కమ్ముల ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుందా అని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

కూలీని ముందే చూసే అదృష్టం కలిగింది

అన్ని విభాగాల్లో కూలీ నంబర్ వన్ అని ఉదయనిధి కితాబు

రజనీకాంత్ 'కూలీ' కోసం తలైవా అభిమానులతో పాటు ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులు ఎదురు చూస్తున్నారు. గురువారం నుంచి ఈ చిత్రం థియేటర్‌లలో సందడి చేయనుంది. తాజాగా దీనిపై తమిళనాడు ఉప ముఖ్యమంత్రి, నటుడు ఉదయనిధి స్టాలిన్ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. ఈ సినిమాను ముందుగా చూసే అవకాశం కల్పించినందుకు చిత్రబృందానికి థాంక్స్ చెప్పారు. ఇండస్ట్రీలో 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రజనీకాంత్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. విడుదల కానున్న 'కూలీ' కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. దీన్ని ముందుగా చూసే అవకాశం లభించినందుకు ఆనందంగా ఉంది. ఈ పవర్‌ఫుల్ మాస్ ఎంటర్-టైనర్‌లో ప్రతి సన్నివేశాన్ని ఎంజాయ్ చేశా. విడుదలైన ప్రతి ప్రాంతంలోనూ ఈ సినిమా కచ్చితంగా ప్రేక్షకుల మనసు దోచుకుంటుంది అంటూ చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. దీనిపై స్పందించిన దర్శకుడు లోకేశ్ కనగరాజ్ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. 'సినిమా మీకు నచ్చినందుకు ఎంతో ఆనందంగా ఉంది' అని పేర్కొన్నారు. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రజనీకాంత్ ప్రధానపాత్రలో తెరకెక్కిన ఈ యాక్షన్ థ్రిల్లర్‌ను ప్రకటించిన నాటి నుంచి ఆసక్తి నెలకొంది. దీంతో ప్రీసేల్ బుకింగ్స్‌లోనే రికార్డు సృష్టిస్తోంది. ఈ సినిమాకు ఇప్పటి వరకు ప్రపంచవ్యాప్తంగా 12 లక్షల టికెట్స్ విక్రయించినట్లు- ఆంగ్ల మీడియా పేర్కొంది. ఇక తెలుగు రాష్ట్రాల్లో టికెట్ బుకింగ్స్ ఓపెన్ చేసిన గంటలోనే లక్ష టికెట్స్ కొనుగోలు చేసినట్లు- నిర్మాణసంస్థ కూడా తెలిపింది. ఓవర్సీస్‌లోనూ అత్యధిక ప్రీసేల్ బుకింగ్స్ జరిగిన తొలి తమిళ సినిమాగా రికార్డు నెలకొల్పిందని పేర్కొంది. దీంతో మొదటి రోజు ఈ సినిమా రూ.100 కోట్ల క్లబ్‌లో చేరడం ఖాయమని అభిమానులు భావిస్తున్నారు.

జల్సా మరోమారు సెప్టెంబర్ 2న విడుదల



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా సెప్టెంబర్ 2న ఆయన అభిమానుల కోసం 'జల్సా' సినిమాను మళ్లీ రీ రిలీజ్ చేయబోతున్నారు మేకర్స్. ఈ విషయాన్ని గీతా ఆర్ట్స్ సంస్థ సోషల్ మీడియా వేదికగా అధికారికంగా ప్రకటించింది. గతంలో 2022లో కూడా పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా 'జల్సా' సినిమాను 4కె వెర్షన్‌లో రీ-రిలీజ్ చేశారు. అయితే అప్పుడే ఈ చిత్రం రూ.3 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి రీ-రిలీజ్ సినిమాల్లో కొత్త రికార్డులను సృష్టించింది. అయితే ఈ సినిమాను మళ్లీ చూడటానికి అభిమానులు ఆసక్తి చూపుతుండడంతో సెప్టెంబర్ 2న రీ రిలీజ్ చేయబోతున్నారు మేకర్స్.

Printed, Published and Owned by Ganji. Venkatesh, Printed At Nandini Printers H.NO . 3-29, Mankhal Village, Tukkuguda Muncipalty, Maheswaram Mandal, Ranga Reddy District - Pin Code 501359 And Published From H.NO. 3-29, Mankhal Village, Tukkuguda Muncipalty, Maheswaram Mandal, Ranga Reddy District - Pin Code 501359 Telangana State. Editor Ganji Venkatesh
RNI NO: TELTEL /2022/85167, Phone NO 9705347284, Email ID:Padmakranthi2022@gmail.com.